కాంతం

1

మా కాంతం అంత పొడగరీకాదు పొట్టీకాదు. పెద్ద రూపసికాదు. కాని ఓ మోస్తరు అందకత్తె. ఆమె శరీర చ్ఛాయ బంగారుపసిమిగాదు చామనచాయ. నవ్వు మొగము, చక్కని నేత్రాలు. ఆమె కన్నులలో దివ్యజ్యోతి కనబడుతూ ఉండేది.

మా కాంతానికీ నాకూ బహు చిన్నతనంలో వివాహం అయింది. చిన్నదై ఉన్నప్పుడు మా ఆవిడ నాకేమంత అంద మైన మనిషిలాగ కనిపించేదికాదు. అప్పుడప్పుడు నేను అత్తవా రింటికి వెడుతూ ఉండేవాడిని. అల్లాంటప్పుడు ఆమెను చూస్తూ ఉండేవాడిని. ఒక్కొక్కప్పుడు ఛరవాలేదు మా కాంతం సుమారైన అందగత్తె అని అనుకొనేవాడిని.

చూస్తూ చూస్తూ ఉండగానే, ఆ పిల్ల ఓణీలు వేయటం సాగించింది. నేనూ లాగులు వదిలేసి పంచెలు కట్టటం ప్రారంభించాను.

ఓ సంవత్సరాది పండగకు నేను అత్తవారింటికి కెళ్లాను. సాధారణంగా జుట్టు విరబోసుకొని వీధిలో ఎగిరే పిల్ల నాకు ఆ నాడు కనిపించలేదు. నేను హాల్లోకూర్చుని ఇటూ అటూ చూశాను. ఎక్కడా ఆ పిల్లజాడ కనుపించలేదు. మా బావ మరది అప్పటికి ఏడేండ్ల పసివాడు. వాడిని పిలిచి రహస్యంగా అడిగాను. "మీ చిన్న అక్కయ్య ఎక్కడుందిరా?" అని. వాడు నా కేమీ జవాబు చెప్పకుండా లోపలికి పరుగెత్తికెళ్లి "అమ్మా చిన్న అక్కయ్య ఎక్కడుందే?" అని వాళ్ళ అమ్మను అడిగాడు. ఆవిడగారు 'ఎందుకురా నాయనా!' అంది. "బావ అడుగుతున్నా" డని చెప్పేశాడు. అప్పటికింకా కార్యం కాలేదు. ఈ మాటవిని మా అత్తగారు నవ్వింది. మా మరదలు బయటికొచ్చి నన్ను జూచి, అవ్వ!-ఏమిటి బావా అది? అక్కయ్యతో ఏంపని నీకు? అని విరగబడి నవ్వింది.

నాకు చాల సిగ్గేసింది. నేను గోడవేపు ముఖంపెట్టి మంచంమీద పడుకొని నిద్రపోతున్నట్లు నటించాను. మా మరదలు పోయి ఇంటి పక్కనున్న అగడజను పిల్లలను లాక్కొచ్చింది నన్ను చూపటానికి. వాళ్ళంతా లోపల చేరారు. ఏవో గుసగుస లాడుకొన్నారు. నవ్వుకొన్నారు. ఆ తరువాత

ఒక్కొక్కరే వచ్చి నన్ను జూచి కడుపు చెక్కలయ్యేలాగున నవ్వుకొని వెళ్ళి పోయేవారు.

వీళ్ళు ఎంతనవ్వినా నాకుమటుకు మా కాంతాన్ని చూడాలన్న కోరిక పోలేదు. అప్పటికి రెండేళ్ళక్రింద చూశాను ఆ పిల్లను. ఇప్పు డెట్లాఉందో!! పెద్దమనిషి అయినతరువాత పిల్లలు ఇట్టే ఎదుగుతారట! ఈ అమ్మాయి ఎంత ఎదిగిందో! బహుశః చీరలు కడుతూ ఉండవచ్చు! అని అనుకొంటూ అక్కడే పడుకొన్నాను.

నవ్వులు ఆగిపోయినాయి. ఎక్కడివాళ్లు అక్కడ సద్దుకొన్నారు. సాయింత్రం నాల్గుగంటలైంది కాస్త చల్లబడ్డది. లేచి ఊళ్లోకిపోయి గుక్కెడు కాఫీ తాగివద్దామా అని అనుకుంటూ కళ్లు మూసుకొని పడుకొని ఉన్నాను. ఇంతలో గాజుల గలగలలూ, క్రొత్తచీర రెపరెపలూ వినిపించినై. దానితో పాటు మగువ పొలపు దెలుపు నొక మారుతంకూడా సోకినది పారిజాతకుసుమ పరిమళ భరితమైనది.

అయితే ఎవరో ఇంకో కొత్త ఆవిడ వస్తున్నది కాబోలు నన్ను చూసి నవ్విపోవటానికి అనుకొన్నాను. అందుకని కళ్లు గట్టిగా మూసుకొన్నాను బాగా నిద్రలో ఉన్నవాడిలాగ.

ఆ వచ్చిన ఆవిడ ఎవ్వరోగాని, అందరిలాగ ఒక నవ్వు నవ్వి పోలేదు. అసలు నవ్వలేదు. అక్కడే నుంచుని ఉన్నట్లు నాకు అనుమానం కలిగింది. కొద్దిగా కళ్ళు తెరిచి చూశాను. ఎవరో పదహారు ఏండ్లపిల్ల! ఆవిడ ఏదో వస్తువకోసం ఆ హాల్లో వెదుకుతున్నట్లు నా ఊహకు తోచింది. బాగా కళ్ళు తెరిచి చూడటానికి భిడియం. ఎవరైతే మనకెందుకని కళ్ళు మూసుకొనే వయస్సు కాదు నాది.

ఇంతలో ఆ అమ్మాయి నా మంచం వైపుకే నడవటం నేను చూశాను ఎందుకో గుండె దడదడ కొట్టుకొన్నది. ఏదో ఆనందంకూడా ఉంది.

దాని తరువాత జరిగిన సంగతులనుబట్టి తెలుసుకొన్న విషయం ఏమిటా అంటే ఆమె సాదు బరిణకోసం వచ్చిందట. ఆ బరిణ నా మంచానికి ఇటు వైపున ఒక చిన్న బల్లపైన ఉన్నది. దాన్ని తీసుకోవాలెనంటె నాపైగా వంగి తీసుకోవాలె.

ఆ పిల్ల ఒక క్షణం ఆలోచించి, అటూ ఇటూ చూచి ఎవ్వరూ లేరని నిశ్చయించుకొని చటక్కున నాపైన వంగి ఆ బరిణ అందుకోబోయింది. ధైర్యంగా బాగా కళ్లువిప్పి చూశాను మా కాంతమే. పొడుగు ఎదిగింది, వళ్లుచేసింది,

చాయ వచ్చింది. రెండేళ్లల్లో అంతమార్పు ఎల్లాగ వచ్చిందో నేను ఊహించుకోలేకపోయినాను. పూతకొచ్చిన మామిడి గున్నలాగ తయారైంది. నునుపైన రేకులు దట్టంగా వొత్తుగా ఒకదానిని ఒకటి అంటిపెట్టుకొని ఉన్న తొగ లి పొత్తిలాగుంది ఆమె శరీరం. స్త్రీ స్పర్శ తగలటం నాకు అదే మొదటిసారి. చంద్ర దర్శనానికి మహోదధి పొంగినట్లు నా హృదయం పొంగింది

ఆమె తలవొంచి మొగంపై ఒక చిరునవ్వు కనపర్చింది. క్షీరసాగరంలో చంద్రుడు ఉదయించినట్లు అయింది. ఆమె నా వంక చూచింది. వ్యాకరణానికి అతీతమైన ఆమె కన్నుల లోని భాష నాకు అర్థమైంది. అప్రయత్నంగా నేను చేతులు చాచాను. నా ఆలింగనంలోకి ఆమె మెల్లగా జారింది. నేను మరింత గట్టిగా ఆమెను నా హృదయానికి హత్తుకొన్నాను. ఆమె సిగ్గుపడి నవ్వి, ముక్కుపైన వేలు వేసికొని 'తప్పు' అన్నది.

నేను చేసింది చాలా తప్పుపనట! ఎవరైనా చూస్తే ఏదో అంటారట!!

ఎవరేమన్నా సరే, ఆమెను వదలాలని నాకు బుద్ధిపుట్ట లేదు. మరింత గాఢంగా కౌగలించుకొన్నాను.

ఇంతలో ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది. అయినా నేను అల్లాగే ఆమెను వదలకుండా ఉండటంజూచి, ఆ పిల్ల చటుక్కున నా చెంపమీద మృదువుగా కొట్టింది. నేను వదిలేశాను. ఆ అమ్మాయి తుర్రున పారిపోయింది.

నా జీవితంలో అది దివ్యదినము. నా వళ్లు అంతా పులకరించింది. ఆ పులకలు నా జీవితం అంతా అల్లాగే ఉండి పోతయ్యి అనుకొన్నాను.

ఆ తరువాత కొద్ది రోజులకే ఆమె సతీత్వం స్వీకరించింది. మేము సంపూర్ణమైన అర్థంలో భార్యా భర్తలము అయినాము.

ఒక వెన్నెలరాత్రి ఆమె మాయింటికి రాణీ అయింది. ఆరోజు రాత్రి ఆమె తెల్లని చీరకట్టుకొని తెల్లని మల్లెపూలు జెడలో పెట్టుకొని, దొడ్లో ఆ వెన్నెలలో తిరుగుతూ ఉంటే జ్యోత్స్నాతరంగాలపై పుణ్యలోకాలనుంచి దిగివచ్చిన ఒక అప్సరఃస్త్రీవలె కనపడ్డది.

2

అప్పటికి నేను బి. ఏ. రెండో సంవత్సరంలో ఉన్నాను. విజయనగరంలో చదువు. కాలేజీ తెరిచారు. ఇహ వెళ్లాలె. ప్రయాణం ఇంకా నాలుగురోజులు ఉంది అనగానే నేను మా నాన్నతో అన్నాను. నాన్నా విజయనగరంలో పూటకూళ్ల ఇంట్లో భోజనం ఏమీ బాగుండటంలేదు అని. అదీకాక క్రిందటి సంవత్సరం జంక విరోచనాలు పట్టుకొని ఎన్నాళ్లో వదలక బాధించినై కూడాను. ఆ సంగతి మా నాన్నకు తెలుసు. . మా నాన్న ఏమీ మాట్లాడలేదు. వియ్యంకుడికి ఉత్తరం వ్రాసిఉంటాడు. ఎందుకంటే మూడో రోజుకల్లా మా మామగారు పిల్లను తీసుకొచ్చి మా ఇంట్లో దిగబెట్టి వెళ్లాడు.

"నాయినా విజయనగరంలో నీవు ఒక్కడివే ఉన్నా నెలకు ఇరవై రూపాయలు కావాలె. ఆ ఇరవై పెడితే మీరు ఇద్దరూ హాయిగా ఉండవచ్చు. కావలిస్తే ఇంకో నాలుగో అయిదో పంపిస్తాను. కోడలును కూడా తీసుకెళ్లు" అన్నాడు మా నాన్న ప్రయాణం రేపనగా. లోపల

సంతోషంగా ఉన్నా పైకిమాత్రం కష్టంలేనివాడిలాగే నటించి "ఊఁ ఎందుకునాన్నా" — అని అన్నాను.

ఈ మాటలు విని మా ఆవిడ ఫక్కున నవ్వింది. నేనూ కొద్దిగా నవ్వుకొన్నాను. ఇంకా ఎక్కువగా నటన చేయటానికి వీలు లేకుండాపోయింది. మర్నాడు ప్రొద్దున బండికే బయలు దేరాము విజయనగరంలో కొత్త కాపురం పెట్టటానికి.

మా నాన్న మమ్మల్ని రైలు ఎక్కించి కోడలుతో చెప్పాడు. "కాస్త కనిపెట్టి ఉండు అమ్మాయీ. వాడు కష్టపడి చదివి ప్యాసు అయినాడా, అంతా సంతోషిస్తాము"

మేము విజయనగరంలో ఒక మేడలో కాపురంపెట్టాము. క్రింద వంటగది ఉంది. పైన నేను చదువుకొనేగది. మా ఆవిడ క్రింద మసులుతూ ఉంటుంది. నేను పై గదిలో హాయిగా నే చదువుక్కోవచ్చు ఆవిడతో ఏ సంబంధంలేకుండా. నా చదువు కేమీ ఆటంకం కలగకుండా ఉండటానికి ఇల్లాంటి ఏర్పాటు చేశాను.

పగలల్లా కాలేజీలోనే సరిపోయేది. రాత్రిళ్లు మా ఆవిడ అజమాయిషీక్రింద చదివేవాడ్ని. ఆవిడ నాకు పెంద లాడే భోజనంపెట్టి ఇహ హాయిగా చదువుకోండి వెళ్లి

అని చెప్పి పైకి పంపించేది. పరీక్షలుకూడా దగ్గరకు వచ్చినై. కష్టపడి చదవాలె. అందుకని నేనూ శ్రద్ధగా చదవాలన్న నిశ్చయంతోనే వెళ్ళేవాడ్ని. కాసేపు చదువుకోనేసరికి విసుగు కలిగేది. "ఇదుగో కాంతం, ఒక్కసారి ఇల్లా వస్తావా?" అని పిలిచేవాడ్ని. ఆమె వచ్చేదికాదు. తాను వస్తే నా చదువు ఎక్కడ పాడైపోతుందో అని ఆమెభయం క్రింద నుంచే కోప్పడేది. "ఎందుకండీ రావటం? చదువుకోండి" అంటూ.

నిజానికి ఎందుకూ ఆవిడ రావటం! ఏమీపనిలేదు. ఈ సంగతి జ్ఞాపకానికివచ్చి, మళ్లీ చదువుకొనేవాడ్ని. కాని కాసేపటికి మళ్లీ పిలవక తప్పేదికాదు. "కాంతం ఒక్కసారి రావాలె" "ఎందుకండీ" అనేది ఆవిడ. "ఎందుకేమిటి తెలియటంలా—ఈ కిటికీ ఇల్లాగ తీసిపెట్టాలెందుకూ" అని నేను కోప్పడితే ఆవిడ "కిటికీ తీసిపెడితే మీకు వచ్చిన ఇబ్బం దేముందండీ ఊరికే గోల! చదువుకోండి" అని మళ్లీ అంటుంది.

ఎల్లాగ చదువుకోటం. ఆ సమయానికి ఉక్కగా ఉండేది. ఇందుకని ఆమె వచ్చి కాసేపు విసిరితే హాయిగ చదువుకొందును. ఆవిడ రాదు.

ఉక్క లేకపోతే చలిగా ఉంటుంది. చలిగా ఉంటే ఆవిడొచ్చి శాలువ కప్పాలె. ఆ శాలువ ఎక్కడుందో నాకు అసలు కనపడదు. పరుపు క్రిందే ఉందండీ చూడండి. కనపడుతుందని అంటుంది కాని నాకు ఆ శాలువ ఎంత వెతికినా కనపడదు. ఆ సంగతి నాకు అసలు తెలుసు. అందుకని నేను వెతకనుకూడా వెతకను. ఆమెనే కేకలేస్తాను రమ్మని. నా చనువు ఎక్కడ పాడైపోతుందో అని ఆవిడగారు రాదు.

ఆ తరువాత పది నిమిషాలకు టైము ఎంత అయిందో అని గడియారంవంక చూస్తే పది అయి ఉంటుంది. పదింటికల్లా పడుకొని మళ్లీ తెల్లవారుఝామున లేవటం మంచిదని మా నాన్న ఎప్పుడూ చెప్తూ ఉండేవాడు. తండ్రిమాట వినాలె. అందుకని వెంటనే పడుకొంటానికి నిశ్చయించుకొని పడుకొనేవాడ్ని. చలికాలం అయినా పడుకోబోయేటప్పుడు నాకు చెంబెడు మంచినీళ్లు త్రాగడం అలవాటు. అందుచేత కాంతాన్ని మళ్లీ కేక వేయక తప్పేదికాదు. "కాంతం కాసిని మంచినీళ్లు ఇచ్చిపో" అని నేను పిలిచేవాడ్ని. ఈ కేక విని తొంగుంటున్న ముసలమ్మకూడా మా ఆవిడను కోప్పడేది.

"ఏమిటమ్మాయ్ వెళ్ళు. మంచినీళ్ళు ఇవ్వకపోతే ఎల్లాగూ? ఎంత దాహంగాఉందో పాపం పిల్లకు!" కాంతానికి తెలుసు మంచినీళ్ళు వండుకొనే సమయంలో కాని అడగడని. ఏమవు కట్టిపెట్టానని తెలుసుకొని అప్పుడు వచ్చేది అపిశాగారు పై గదిలోకి. అంత కట్టుదిట్టంగా నన్ను [illegible] [illegible] వ్యాసు చేయించింది.

నేను పది పుస్తకాలన్నా దిద్దకముందే గది గుమ్మంలో గాజుల చప్పుడు వినిపించేది. గుండు చెంబుతో నీళ్లు పట్టుకొని, వెండి పళ్ళెంలో ఫలహారాలు పెట్టుకొని రతీదేవిలాగ తయారై వచ్చేది ఆవిడ. ఆమె రాకకోసం నేను నిరీక్షిస్తున్న మాట నిజమే. అయినా, అనేవాడ్ని "అప్పుడే వచ్చావ్" అని. "అప్పుడే ఏమిటండీ పది కావస్తుంటేనూ" అనేది ఆవిడ. నీవు వస్తే నాపని సాగదు అని నేను నవ్వటం, నేనేం జేశా నండోయ్ మీరు వ్రాసుకోండి అని ఆమె అనటం మామూలుగా జరిగే సంభాషణ

ఆవిడ నా దగ్గరకొచ్చి, నా బల్లకు దగ్గరఉన్న టిపాయ్ మీద నీళ్ల చెంబు, వెండి పళ్లెం పెట్టి పైన రెండు పుస్తకాలు మూతపెడుతుంది.

ఆవిడ రావడంవల్ల నా చదువు కేల నష్టం! నిజానికి. నాపని నేను చేసుకోవచ్చు ఆ వచ్చినమనిషి చప్పుడు చేయకుండా నిద్రపోతే.

అక్కడ అద్దంముందు నుంచుని ఆవిడ అలంకారం ప్రారంభిస్తుంది. నా దువ్వెన్లు, స్నో, పౌడరు, పూలచెండూ ఇవన్నీ కనపడాలె. వీటికోసం అన్వేషణ మొదలు. ఏమండీ నా స్నో బాటల్ చూశారా? అని మొదటిప్రశ్న. నిజానికి

ఆవిడ స్నోబాటిల్ విషయమై నాకు తెలియాలిసిన అవసరం ఏమీలేదు. ఇహ దానికోసం వెతకటంలో నా కాంపోజిషన్ పుస్తకాలన్నీ చిందరవందర అవుతై. అలమారలోని రెండు టీకప్పులు పగిలిపోవచ్చు. కొంతసేపైనతరువాత అది నేను కూర్చున్న కుర్చీకి సరిగ్గా వెనకాలున్న గూట్లో కనిపించటంచేత ఆవిడ నా బుజాలమీద చెయ్యివేసి అవసరం లేకపోయినా కొద్దిగా నొక్కి, ఆమె వక్షస్థలం నా చెంపకు తాకించి, నానా అవస్థాపడితేగాని ఆ బాటిల్ బైటపడేదికాదు. ఆ స్నో ఆమె కాస్త రుద్దుకొని నాకు కాస్త రుద్దేది.

ఆ తరువాత తలనూనె సీసాకోసం వెతకటంలో ఆవిడ నేను కూర్చున్న కుర్చీమీదే ఎక్కి అలమరలో పై భాగాన్నుంచి తీయాలె. ఆ సమయంలో ఆమె తూలి పడిపోవ-బోవటం నేను చటుక్కున లేచి నడుము పట్టుకొని ఆపి, ఆ తరువాత ఆమెను పసిపిల్లను ఎత్తుకొన్నట్లు ఎత్తుకొని దింపటం జరిగేది. దీనికి ప్రతిఫలంగా ఆవిడ కాస్త సుగంధ ద్రవ్యాన్ని నా తలకురాచి చక్కగా పాపటతీసి తల దువ్వేది.

సాదుబొట్టుకోసం, దువ్వెనకోసం, పౌడరు డబ్బా కోసం ఆమె వెతుక్కోటంలో నా చుట్టూ ఎన్నో ప్రదక్షిణాలు అయ్యేవి. ఆ వస్తువులన్నీ నేను కూర్చున్న ప్రదేశానికి

అట్టూ ఇట్టూ ఉంటూఉండటం మూలానా, ఆవిడకు ఇల్లాగ చేయక తప్పేదికాదు. ఆవిడ వచ్చేవరకి దిద్దుతూ ఉన్న కాంపోజిషన్ పుస్తకం నా వంక జాలిగా చూస్తే, నేననేవాణ్ని "ఇహ నీ సంగతి రేపు — ఇప్పుడు వీల్లేదు" అని మిగతా పుస్తకాలన్నీ కళ్లు మూసుకొని బల్లక్రిందపడి నిద్రపోయేవి.

ఆ తరువాత ఆవిడ బ్రోచ్ కనిపించేదికాదు. కనిపించినా అది సరిగ్గా పెట్టుకోటం ఆవిడకు తెలియదు పల్లెటూరి పిల్ల కావటంచేత. కొన్నాళ్ళపాటు అయినా నేనే ఆవిడకు [illegible]చి చెప్పాలిసిన అవసరం కలిగింది. ఆవిడ పమిట సద్ది ఈ అలంకారం విషయమై నేను శ్రద్ధ వహించాలిసి వచ్చింది.

ఈ గోడవంతా చూస్తూ నవ్వుతూఉన్న మల్లె పూచెండును అప్పుడు మా ఆవిడ ఎత్తుకొని ముద్దాడి, కళ్లకు అద్దుకొని నా చేతుల్లో పెట్టేది. నా చేతులమీదుగా అది ఆమె ముచ్చట ముడిలోకెక్కి అర్ధచంద్రాకృతి తాల్చేది.

ఈ పనిమటుకు అంత తొందరగా అయ్యేదికాదు. అల్లా కాదండీ అంటూ ఆవిడ దాన్ని తీసి చాలాసార్లు నాకు ఇస్తూ ఉండడంవల్ల, ఆ చెండు నా చేతుల్లోనుంచి ఆవిడ చేతుల్లోకీ, ఆవిడ చేతుల్లోనుంచి నా చేతుల్లోకి మారేది

కిలకిలా నవ్వుతున్న పసిపిల్లలాగ. అప్పటికి ఆవిడ అలంకారం ఒక విధంగా పూర్తి అయ్యేది.

అగరు వత్తులు అలమారులో, పై అరలో ఉంటై. అది ఆవిడకు అందదు. అందనప్పుడు నన్ను తీయమనాలె. ఆవిడ అల్లాగ అనదు. అక్కడకు వెళ్లి ముందు ప్రయత్నం చేస్తుంది అం దు కో టా ని కి. అప్పుడు నన్ను పిలుస్తుంది "చూడండి కాస్త అవి తీయాలె" అంటూ. రోజూ ఇల్లాగే అంటుంది. అయినా నాకు అవి ఏమిటో ఎక్కడినుంచి తీయాలో తెలిసేదికాదు. అందుకని నేను అడిగేవాణ్ని ఏమిటి నీకు కావలసింది? అని. ఆవిడ అటు వేలుచూపేది నవ్వుతూ. "అవా? టీ కప్పులా? వక్కలా?" అని నాకు వచ్చిన పేర్లన్నీ వల్లిస్తూఉంటే ఆవిడ ఊహు, ఊహు అంటూ నవ్వుతూ ఉండేది. అవి నాకూ అంకవు. అందుకని ఎడం చెయ్యి ఆమె బుజంపైన వేసి, ఎగిరి కుడిచేత్తో వాటిని క్రిందకు నెట్టేవాణ్ని. పోనీ వాటిని క్రింది అరలో ఉంచరాదా అంటే "వద్దండీ క్రింది అరలో ఉంచుతారుటండీ ఎక్కడన్నా!" అని నవ్వేది. క్రింది అరలో ఉంచటం వ్హి తెలివితక్కువపని అయినట్లూ నాకు ఆమాత్రం తెలియకపోవటం విచిత్రమైనట్లూనూ!

అగరు వత్తులు వెలిగించటం ఒక అరగంట పని ఎందుకూ అంటే ఆమె అవి వెలిగించటానికై నిప్పుపుల్ల గీస్తే నేను దాన్ని ఉఫ్ అని ఊది ఆర్పేవాడిని. ఆమె మళ్లీ గీస్తే నేను మళ్లీ ఆర్పేవాడ్ని. ఇల్లాగ ఎన్నిసార్లు అయినా జరిగేది. చివరకు ఎట్లాగో తంటాలుపడి ఆవిడ అగరువత్తులు వెలిగించేది. సుగంధ భరితమైన ఆ ధూమం గదంతా ఆవరించి నాకు కొంచెం మత్తు కలుగజేసేది.

ఆమె చెయ్యవలసిన పని అంతా అంతటితో పూర్తి కావటంచేత ఆమె నా పక్కనేఉన్న మంచంపైన కూర్చునేది. మర్నాడు క్లాసులో చెప్పవలసిన పాఠం నేను ఒక్కసారి చదవటం అవసరం. హిస్టరీపుస్తకం తెరిచి చదవటం ప్రారంభించే వాడిని.

మా ఆవిడకు హిస్టరీఅంటే బొత్తిగా ఇష్టం లేదు. అందులో అభిరుచి కలుగజేయాలని, తల్లికోట యుద్ధాన్ని గురించీ, హెన్రీ-ది-ఎయిత్ ను గురించి ఆమెకు చెప్పాను. చెప్పినా ఆమెకు ఏమీ అభిరుచి కలుగలేదు. అందుకని ఆవిడ "చచ్చిపోయిన వాళ్ళ సంగతులు ఎందుకండీ, తల్లికోటయుద్ధం ఎల్లా తగలెడితేనేం! హెన్రీ-ది-ఎయిత్ కు ఎంతమంది భార్యలైతేనేం!" అని అనడం మామూలు.

నేను పుస్తకం తెరిచి ముందు పెట్టుకొంటే ఏం లాభం. ఒక్క విషయమూ బుర్రకు ఎక్కేదికాదు.

ఇంతలో ఆవిడ వక్కపలుకులు నా నోటికి అందించేది. నేను వక్కలతోపాటు ఆమె వేలునుకూడా అందుకొని పంటితో నొక్కితే, ఆవిడ వేలునులాక్కొని "అబ్బ! ఏమిటండీ ఎందుకూ కొరికారు!" అని అడుగుతుంది. నే నంటాను— "అల్లా కొరకపోతే—నోట్లో వేలుపెడితే, కొఱకనేరని అమాయకుడమ్మా మా ఆయన అని నీవు అందరితో అంటావు అందుకని. ఏదీచూడనీ నొప్పెట్టిందా?" అని. దాని తరువాత ఆవిడ లేత తమలపాకులు చిలకలుచుట్టి ఇవ్వటం నేను నమలటం కబుర్లుచెపుతూ. దీనితోనే అయిపొయ్యేది ఒక గంట.

అప్పటికి నిద్రవేళ. మా కాంతం ఆవలించి రెండు చిటికలువేసి అమ్మ ఉంటూ నడుమువాల్చేది. ఆ నిద్రవేళ నేనుమటుకు ఏం చదవగల్గును! ఆ పుస్తకాన్ని మూసి బల్లమీద పెట్టి, పడుకోటానికి సిద్ధపడేవాడిని.

అదేగాక మత్తెక్కించే పరిమళాలు, ఉపభోగ సూచకమైన ఆ తెల్లని శయ్యా నన్ను ఆహ్వానిస్తుంటే ఏమంటానికి

తోచేదికాదు. మా ఆవిడ వలకపోసిన నవ్వులన్నీ ఆకృతి దాల్చినట్లు మల్లెపూలన్నీ ఆ పక్కపైన పడి, దొర్లుతూ నన్ను ఆహ్వానించేవి. ఆఖరంగా నేను దీపం తగ్గించటం గ్రహించి, ఆవిడ నవ్వుతూ, పక్కకు ఒత్తిగిలి, ఆమె దిండుపైన నా తల పెట్టుకోవటానికి కాస్త చోటు ఇచ్చేది.

4

మా ఆవిడకు ఇంగ్లీషు రాదు. రాకపోయినా కొన్ని ఇంగ్లీషు మాటలు మధ్య మధ్య ఉపయోగిస్తూ ఉండటం మూలాన, ఈవిడకు ఇంగ్లీషు వచ్చునేమోనని ఇతరులు అనుకోవచ్చు. "మీరు మాట్లాడుతూ ఉంటే నాకేదో అర్థం అయినట్టే ఉంటుందండీ" అని కూడా అంటూ ఉంటుంది ఆవిడ.

కాబట్టి మంచి ఊహా, తెలివితేటలూ ఉన్నాయని తోచి, దీనికితోడు శాస్త్ర చదువు చెబితే ఇట్టే అల్లుకు పోతుం దనుకొన్నాను. మా ఆవిడ ఇంగ్లీషు మాట్లాడుతూ ఉంటే వినాలనీ స ర దా పు ట్టిం ది. అదో కష్టమైన పనికాదు. నా చేతులోపని! ఊళ్లో వాళ్ళ అందరికి, చెప్తున్నా కదా నా స్వంత భార్యకే చెప్పుకోలేనా!

ఇంగ్లీషు పుస్తకం ఒకటి కొనుక్కొచ్చాను. అక్షరాలు గుర్తుపట్టటం నాలుగైదు రోజుల్లో వచ్చింది. చాలా సంతో షించాను. నేను అనుకొన్నట్లు తెలివితేటలు ఉన్నవి. చెబితే వస్తుంది. రోజూ ఓ గంటా రెండు గంటలు శ్రమపడిచెప్పి

నాలుగు నెలల్లో ఏడ్స్ రీడరు పూర్తి చేయించ గలుగుతాను. ఒకటి రెండు సంవత్సరాలకల్లా ఇంగ్లీషు పేపరు తాను స్వయంగా చదువుకొనే శక్తి వస్తుంది.

ఆ తరువాత భార్యాభర్తల జీవితం అదో శమాషాగా ఉంటుంది. నేను ఇంటికి రావటంతోనే ఆవిడ ఇంగ్లీషుతోనే స్వాగతం ఇస్తుంది. నేను క్లబ్బుకు వెళ్ళాలసిన అవసరమూ ఉండదు. బైట వరండాలో పడకకుర్చీలో జేర్లబడి కూర్చుంటే మా ఆవిడ నాకు ఎదురుగా కుర్చీలో కూర్చుని అంచక్కా పేపరు మొదటినుండి చివరదాకా చదివి వినిపిస్తుంది. మొదట్లో ఉచ్చారణలో కాస్త తప్పులు వస్తే నేను చెబుతూ ఉంటాను.

అయితే పేపరు చదివించటమే నా ఏకైక ఉద్దేశయంగా పెట్టుకోలేదు. వీలైతే బెనారెస్ విశ్వవిద్యాలయ మెట్రిక్యులేషన్ పరీక్షకు కట్టించి ప్యాసుచేయిస్తా మనుకొన్నాను. "పరీక్షలుప్యాసై ఉద్యోగాలు చేస్తుందా ఎందుకయ్యా నీకీ పిచ్చి" అని అయినవాళ్లు అందరూ అంటే అంటారు. ఆ మాటలు లెక్క జేయకుండా చదివించటమే నిశ్చయించుకొన్నాను.

ఆ పరీక్షగనక ప్యాసు అయిందా ఆ తరువాత ఎల్లాగో కష్టపడి బి. ఎ. దాకా చెప్పించాలనే నా ఊహ.

అప్పటికి మా ఆవిడకు పదహారేండ్లు. ఇంకా పిల్లా జెల్లా కలగలేదు. అందుకని నేను ఊహించినదంతా అసంభవము ఏ మాత్రము కాదు. భగవంతుడి దయ ఉండాలగని, అనుకొన్నదంతా అక్షరాలా జరగటానికి అవకాశాలున్నయి.

మా ఆవిడకు చదువు ప్రారంభించి ఒక్క నెల అయినా కాలేదు. అప్పుడే ఆవిడ చిన్న చిన్న వాక్యాలు చదవటం వ్రాయటం సాధన చేసింది. ఇంగ్లీషు ముక్కలు ఆడవాళ్ళే అనాలి. మొగవాళ్ళ నోట్లోబడి అవి మొద్దుబారి పోతవి. అందం అంతా నశిస్తుంది. మా ఆవిడ క్యాట్—శాట్ అపాన్—అ మ్యాట్ అని అంటూ ఉంటే, వీణల మీటుల్లాగ ఉందిగాని మరోవిధంగా లేదు.

నన్ను లోపటికి రండి అనాలిసి వచ్చినా బైటికి వెళ్ళండి అని అనాలిసి వచ్చినా ఆమె ఇంగ్లీషులోనే అంటూ ఉంటె విని ఏంతో సంతోషించాను.

ఆవిడకు చాలా ఉత్సాహంగా ఉండేది ఒకపాఠం చెప్పి ఇది సాయంత్రానికల్లా కంఠస్థం చేయమని చెప్పి నేను

వెళ్ళేవాడ్ని. స్కూలుపని కావడంతోనే పరుగెత్తుకుంటూ వచ్చేవాడ్ని పాఠం అప్పజెప్పుకుందామని. స్నానంజేసి మంచి తెల్లచీర కట్టుకొని పూలుపెట్టుకొని కుర్చీలో కూర్చుని చదువుకొంటూ ఉంటుంది నేను చెప్పివచ్చిన పాఠం అని అనుకొంటూ ఇంటికొస్తే మా ఆవిడ వంట ఇంట్లోనుంచి కేక పెట్టేది. "వస్తున్నా వస్తున్నా" అంటూ. వంట ఇంట్లోకి పోయి చూస్తును కదా ఆ ఇంగ్లీషు పుస్తకం చాప రాచ్చిప్ప మీద ఉండేది. ఇలాంటి దృశ్యాలు నన్ను చాలా నిరుత్సాహ పరచినవి.

అయినా నేను చదువు చెప్పటం సాగించాను. ఎందుకో ఆవిడకు మొదట్లో ఉన్న ఉత్సాహంగాని పట్టుదలగాని తరువాత తరువాత లేకపోయినై. పాఠం చెబుతూ ఉత్సాహంగా ఉన్న సమయంలో, మా ఆవిడ "ఉండండి ఉండండి ఒక్కక్షణం." అని గబుక్కున లేచి వంట ఇంట్లోకి పరుగెత్తి "ఛా ఛా వెధవ పిల్లి సొంట్లు సోధిస్తుంది, పారిపోయ్యేగే పారపోసింది" అనుకొంటూ, అదిఇది సవరిస్తూ, అక్కడే ఓ అరగంట ఉండటం, ఈ లోపల నేను నిద్రపోవటం జరుగుతూ ఉండేది.

పగలు నాకు తీరిక ఉండేది కాదు. రాత్రి నిద్ర వేళా! చదువు సాగేది కాదు. ఒకరోజున పట్టుబట్టి కూర్చో బెట్టాను ఏమైనా కానీ ఓ ముక్క చెబుదామని. ఆవిడ కళ్లు మూస్తూ, తెరుస్తూ, చిటిక వేస్తూ, వింటూన్నది. ఇంతలో ఆవిడ, ఏదో ముఖ్యమైన విషయం జ్ఞాపకానికి వచ్చి నట్లు ఉలిక్కిపడి, “అయితే చూడండి — ఈ చదువుకేం కానీండి, రేపు కార్తీకమాసానికి యుద్ధం ఆపేసి నవరసులు చాక చేస్తారుటగా” అన్నది.

ఆ మాట పొందిక బహుబాగుంది. యుద్ధం ఆపేసి నవరసులు చాక చేస్తారట! అంటే నవరసులు ప్రియం జేసి, ఆడవాళ్ళను ఏడిపించేందుకే అసలు ఈ యుద్ధం చేస్తూ ఉన్నట్టూ, కాసేపు ఏడిపించి పాపం, ఇకచాల్లే వీళ్ళను ఏడి పించటం అని స్త్రీలకై జాలితలచి, ఈ యుద్ధం ఆపేయటానికి ఎవరో నిశ్చయించినట్టూనూ!

ఆ ఒక్కసారే కాదు. నేను ఎప్పుడు చదువు మొదలు పెట్టినా ఆవిడ నవరసుల గొడవే ఎత్తేది. నవరసులు చాక చేయడాన్ని గురించి ఆవిడ బోలెడు వదంతులను వినేది.

ఈ మధ్య ఒకసారి మిత్రమండలి వారికి ఎక్కడో అఖండ విజయం కలిగిందని పేపరులో పడ్డది. ఆ రోజు

సాయంత్రమే మా ఆవిడ అన్నది. "ఏమండీ మీరు వెళ్లారా" అని. "ఎక్కడికి" అన్నాను. "అయ్యో నా బొందా! మీరు వెళ్ళనేలేదూ? మీ కెందుకు వెళ్తారూ! మనకు ఆ నేస్తూ, ఆ పొందిక ఉంటే, ఇంకా అనుకోవలసిందే ముందీ! ఇవ్వాళ మధ్యాహ్నం ఫిరంగి వేసిన తరువాత ఒక గంటసేపు నవరసులు చౌకగా అమ్మేశారట!" అన్నది.

నేను నవ్వి "ఛా వెర్రిదేనే తెలివి తక్కువదానా నవరసులు ఎందుకు అమ్ముతారూ చౌకగా?" అన్నాను. ఆ పళంగా మా ఆవిడ ముఖం చేటంత చేసుకొని "అయ్యో నన్ను తగలెయ్య!! మీ రింతకూ వినలేదా! మన వాళ్ళకు యుద్ధంలో జయం కలిగిందట. అందుకని ఒక్క గంటసేపు నవరసులు చౌక చేయమని కలెక్టరు ఆర్డరు ఇచ్చాడుటండీ!!" అని బారలు తీస్తూ చెప్పింది. మొత్తంమీద మా ఆవిడకు నవరసుల మీద ఉన్న దృష్టి చదువుమీద లేదు. ఒక విధంగా నవరసులు చౌక అయినదాకా చదువు ఆపేద్దామన్నట్లు సూచించింది.

నేను ఒప్పుకోక, అల్లాగే పట్టుబట్టి చదువు సాగించాను. కాని నాకు ఒకటి తోచింది. నా దగ్గర ఆవిడకు చదువు సాగేటట్లు లేదు. చదువుకని కూర్చోటం ఏమో

కబుర్లు చెప్పటం !! ఆ కబుర్లకు అంతూ పొంతూ లేదు. ఎదో చెప్పేది. నవ్వేది. ఒకటే నవ్వు.

పోనీ పగటి పూట నేను స్కూలుకు వెళ్ళిపోయిన తరువాత ఆవిడకేం పనుంది! చదవకూడదూ? అంహు. నిద్ర అంటుంది. ఎవరోవస్తే మాట్లాడుతూ కూర్చున్నాను అంటుంది. ఎదో అంటుంది. మొత్తంమీద ఆవిడకు ఏమీ తీరిక లేనట్లే తెలుస్తుంది.

అందుకని ఇహ ఇట్లా కాదు. ఈవిడను స్కూలుకు పంపితే మంచిది అనుకొన్నాను. తొమ్మిదింటికల్లా వంట జేస్తుంది. అంతగా అయితే నేనుకూడా సాయంజేస్తాను. ఇద్దరంకూడా తొమ్మిది, తొమ్మిదిన్నరకు భోజనం చేస్తాము. ఆవిడను అల్లా ఆడస్కూలుకు పంపి, నేను ఇట్లాగ మా స్కూలుకు వెళ్లవచ్చు. ఏమీ ఇబ్బంది ఉండదు. సరే అల్లాగే చేద్దామని నిశ్చయించుకొన్నాను.

స్కూలులో చేరి ప్రతిదినమూ బడికి వెళ్లటం అలవాటైనతరువాత, చదువుయందు ఆమెకు తప్పకుండా అభిలాష ఎక్కువ అవుతుంది. చదువుకొనే ఇతర ఆడవాళ్లను చూస్తుంది.

బాగా చదువుకొని పెద్ద పరీక్షలు ప్యాసై వాళ్లవలె విద్యావంతురాలు కావాలను నిశ్చయం ఆమెకు తప్పక కలుగుతుంది.

అని ఇల్లాగ నిశ్చయించుకొని, ఈ సంగతంతా ఆవిడతో చెప్పాను. స్కూలులో చేరవలసిందని ఎంతో ప్రోత్సాహం చేశాను. విద్యావంతురాలైన స్త్రీకి సంఘంములో కలిగే గౌరవం, మర్యాద ఎల్లాగ ఉంటుందో, విద్య లేని స్థితి ఎంత నీచమో ఆమెకు తెలిసేటట్టు, నా నేర్పు ఉపయోగించి చెప్పాను.

నేను చెప్పినదంతా విని ఆవిడ నిం స నం గా స్కూల్కి అయితే, ఎప్పటినుంచి వెళ్ళమంటావూ బళ్ళోకి నన్ను? అని అడిగింది.

రేపు జూలైనుంచి వెళ్లు—అన్నాను. అది విని జనవరి నెల ఆ వి డ ఏదో ఆలోచించి, "అంటే—చైత్రం, వైశాఖం, జ్యేష్టం, ఆషాఢం" అంటూ వేళ్ళ కణుపులు లెక్కబెట్టి, "ఉహూ" అని తల విసురుగా ఊపింది వీలు లేదన్నట్లు.

"ఏం ఎందుకు వీల్లేదూ?"

ఆవిడ విరగబడి నవ్వుతూ, వీల్లేదండీ—బొత్తిగా వీల్లేదు. అని, నవ్వితే దేహం కదలటంవల్ల సళ్ళొదిలిన నీవీబంధాన్ని సవరించుకొంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ సంవత్సరం జూలై నెలలో ఒకరోజున మా ప్రథమ సంతానం రుక్కుతల్లి పుట్టింది. పురుటి గదిలోనుంచి మా మరదలు బైటికొచ్చి "కూతురు! కూతురు కలిగింది బావా నీకూ!" అని చెప్పి "అంతా నీ రూపే బావా ముక్కు నీ ముక్కు! నోరు నీ నోరు! కళ్ళు నీ కళ్ళు!" అని వర్ణించింది.

రుక్కుతల్లి పుట్టిన మరునాటి జూలైలో నాకు టైఫాయిడ్ జ్వరం రావటంవల్ల, ఆవిడ స్కూలులో చేరాలనే ఆలోచనే రాలేదు.

ఆ తరువాత కాంతానికి రెండేండ్లకొకసారి కాన్పు వచ్చి, సుశీ, శాస్త్రి, రాధ, విజయులు వరుసగా పుట్టారు. బిడ్డల తల్లి అయిన తరువాత, కాంతానికి పిల్లలతోనే సరిపోయింది. ఆవిడ చదువుసంగతి అనుకొన్న వాళ్ళు ఎవరూలేరు.

ఈ విధంగా మా ఆవిడ ఇంగ్లీషు చదువు ది—క్యాట్ శాట్—అపాన్—ద మాట్ తో పూర్తి అయింది. కాని

మా కాంతం తెలుగులో కాస్త చదువుకొన్నది. ఆవిడ చిన్నప్పుడు పదేండ్లదాకా ఏకో స్కూలులో చదివింది. ఆ తరువాత ఇంట్లోనే ఉండి, వాళ్ళ అమ్మదగ్గర, నాన్న దగ్గర కొన్ని విషయాలు నేర్చుకోంది.

లంకాయాగం, కుచ్చెలకథ మొదలైనవి ఆమె చెప్పుకొన్నది. కుచ్చెల కథలో కొన్ని ఘట్టాలు ఆమె చదువుతూ ఉంటే దుఃఖం ఆపుకోటం కష్టం అయ్యేది. గోవుపాట కూడా అల్లాగే పాడేది ఆవిడ.

మా ఆవిడ కుమారీశతకం, నృసింహాశతకం చదివింది. కృష్ణ కర్ణామృతంలోని కొన్ని శ్లోకాలు కంఠతావచ్చు. అధ్యాత్మ రామాయణ కీర్తనలు పాడేది. భాగవతంలో నుంచి ప్రహ్లాదచరిత్ర, కుచేలోపాఖ్యానం ఆవిడ చక్కగా అర్థం తెలిసి చదవగలిగి ఉండేది.

ఆవిడకు శ్రీరాముడు అయోధ్యలో ఉండేవాడని తెలునుగాని ఇప్పటి వైస్‌రాయ్ ఎక్కడ ఉంటాడో తెలియదు. రామచంద్రమూర్తి దండకారణ్యానికి ఏ మార్గాన పోయినాడో ఏయే ఆశ్రమాలలో ఆగినాడో తెలుసుగాని

ఇక్కడనుంచి మద్రాసుకు ఎట్లాపోవాలో, ఏ బండి ఎక్కాలో, ఎక్కడెక్కడ మారాలో తెలియదు. పంచాంగం చూచి తిధి వార నక్షత్రాలు చెప్పగలము కాని రైల్వేగైడ్ చూడ లేదు.

5

కాంతం ఏ మాట అయినా వెటకారంగా అన్నా పిసుఫుగా అన్నా తమాషాగానే ఉండేది. కోపం వచ్చే సమయంలో చటుక్కున నవ్వుమాట అనేసేది. దానితో కద్దరం నవ్వుకొనే వాళ్ళం. ఆ వచ్చిన కోపం అంతా దాని దారిన అదే పొయ్యేది.

అమ్మాయిని చూచి వస్తాను, నాలుగు రోజుల ప్రయాణానికి కావలసిన బట్టలు కాస్త సంచిలో పెట్టి ఇయ్యమని అడిగాను ఒకసారి మా కాంతాన్ని. రెండు మూడు చొక్కాలు, ధోవతులు వేసి ఇస్తుంది కదా అని అనుకొన్నాను. తీరా ప్రయాణం అయి బండిలో ఎక్కి చూచుకొంటే అందులో ఒక్క చొక్కా, ఒక్క ధోవతీ ఒక్క తువాలా ఉన్నాయి.

"ఇదేమిటే కాంతం. ఎల్లాగ సరిపోతవి ఇవి" — అని అడిగాను.

"సరిపోకేం? బాగానే సరిపోతై" అన్నది కాంతం.

"చాలవు ఊరికే వాదిస్తూ కూర్చోక ఇంకా రెండు ధోవతులూ, మరిరెండు చొక్కాలూ ఇయ్యి" అన్నాను కోపంగా.

ఎందుకండీ. ఎక్కడన్నా పారేసుకొస్తారు అన్నది ఆవిడ నవ్వుతూ. నాకు ఒళ్ళు మండి పోయింది. "పారేసుకు రావటం ఏమిటి? ప్రయాణం చేసినప్పుడల్లా బట్టలు పారేసుకొస్తున్నానా? అన్నాను విసుగ్గా.

"అంతకోపం ఎందుకండీ? పారేస్తే పారేయా వచ్చు. అందుకని అన్నాను" అంది.

ఇల్లాగ ఆవిడమాట దేనికీ అందకుండా అంటుంది పారేస్తే పారేయ వచ్చుట. అల్లాగ అయితే ఎన్నో జరగ వచ్చు. నాకు ప్రయాణం చేస్తున్నపుడు రైల్లో వంకరూపా యల నోట్లుఉన్న ఒక పర్సు దొరకవచ్చు. లేకపోతే కృష్ణ వంతెన మీద రైలు విరిగి పడిపోవచ్చు. మా రైలు ఇంకో రైలుతో కొట్టుకోవచ్చు. ఈ వచ్చుచచ్చులు భవిష్యద్గర్భంబుల వ్యర్థపదంబులు—అనిగదా సూత్రం — తెలియకా? తెలిసే మాట్లాడుతుంది ఆమె.

ప్రయాణానికని బయలు దేరినపుడు చేతులో సరిగ్గా కావలసిన దానికంటే నాలుగు రూపాయలు ఎక్కువగా

ఉండాలని నా ఉద్దేశం. పొరుగూరులో ఏ సమయానికి ఏమి ఖర్చు వస్తుందో! అక్కడ మనకు ఎవరిస్తారూ కావలసినస్తే! అందుకని నాలుగు రూపాయలు ఎక్కువగానే జేబులో వేసుకొని బయలు దేరుతూ ఉంటాను.

మా ఆవిడకు ఇది బొత్తిగా సరిపడదు. జేబులు వెతికి ఎక్కువగా డబ్బు ఉన్నదని తోస్తే తీసివేసేది "ఎందుకే కాంతం, అల్లాగ తీసేస్తావు? అంటే—"మీకు కావలసిన దానికంటే ఎక్కువ ఎందుకు చెప్పండి? ఏదో అనవసరంగ ఖర్చుచేస్తారని" అనేది. అల్లాటప్పుడు నాకు నుగే చెడ్డకోపం వచ్చేది. "ఎందుకు ఖర్చుచేస్తానూ! అంతమాత్రం జాగ్రత్త నాకు మటుకు లేదా? నీవే మహాజాగ్రత్త మనిషివి కామాలు! అసలు నేను వట్టి తెలివి తక్కువ వాడిని అని నీ అనుమానం" అనేవాడ్ని విసురుగా. "ఆహాఁ హాఁ హాఁ— అనుమానం ఏం లేదండీ. నాకు గట్టి నమ్మకమే" అంటూ ఆవిడ నా వీపుపైన మృదువుగా తట్టి ముఖంలో ముఖంపెట్టి నవ్వేది. కోపం మెల్లగా జారిపోయేది.

మరోసారి సరసానికి వాళ్ళ వాళ్ళను వెక్కిరిస్తూ "కాంతం మీ చెల్లెలు ఓ కోతి, మీ అక్కయ్య మరోకోతి, తోకలుమటుకు లేవు అదొకటే లోపం" — అన్నాను.

మీా చెల్లెళ్ళకు ఆ ఒక్క లోపంకూడా లేదులెండి అన్నది ఆపడ విరగబడి నవ్వుతూ. అంటే తోకల్లేకుండానే కోతులట వీళ్ళ వాళ్ళు. ఇల్లాగ దెబ్బతగలకుండా హాస్యం ఆడటంలో కాంతానిది పెట్టింది పేరు.

మా ఆవిడ కాపరానికి వచ్చిన తరువాత చాలా రోజులు ఏ విధమైన పోరువూ లేకుండానే గడిచి పోయినాయి. ఒకటి రెండుసార్లు మా ఆవిడకు నా మీాద కోపం వచ్చింది. కాని పెద్ద పోట్లాటలు ఏమీా జరగలేదు. ప్రణయ కలహాలు కూడా లేకుండానే కాలం గడిచిపోయింది.

ప్రణయ కలహాలు ప్రేమను ఉద్రిక్తం చేస్తాయనీ, తద్వారా వచ్చే ఎడబాటు క్షణికమైనా, సహింపరానిదై పరస్పరానురాగాన్ని వృద్ధి చేస్తుందనీ అంటారు.

భార్యాభర్తలు సరసోక్తులాడుకొంటున్నపుడు ఏదో మాట మీాద ఆవిడకు కోపంరావటం, ఆయన బ్రతిమలాడి ఆమెను ప్రసన్నరాలను చేసుకోటం సామాన్యంగా జరిగే విషయాలే.

క్రొత్త రోజుల్లో ఆమె మనస్సుకు కష్టం కలిగించేమాట నేను ఎప్పుడూ అనేవాడ్ని కాదు. ఏ మాటమీాదనైనా ఆవిడకు రవ్వంత కష్టం కలిగిందా, నేను ఎంతో నొచ్చుకొనే

వాడిని. ఆవిడ కాస్త దూరంగా నుంచుంటే మరీ ఆకర్షణీయంగా ఉండేది. ఆవిడలో ఏదో క్రొత్త తేజస్సు కనపడేది. ఆవిడ పెదవులు, కళ్లు, చేతులు, పాదాలు అన్నీకూడా క్రొత్త అందాన్ని తెచ్చుకొన్నట్లు తోచేది. ఆవిడ పలుకుల్లో సరిగమల్లో ఇమిడిన మాధుర్యం కనపడేది. అందుకని ఒక్క క్షణంలో మళ్ళీ ఆమెను సంతోషపెట్టి నవ్వించి ఆనందించే వాడిని.

అయితే అవి ప్రణయ కలహాలు మటుకు కావు. ప్రణయ కలహం అనేది ఒక కామక్రీడ. అది శాస్త్రరీత్యా జరపటానికి ఒక చిన్న సత్యనారాయణ వ్రతానికి జరపవలసినంత తంతు ఉన్నది.

శాస్త్రరీత్యా ప్రణయ కలహాన్ని పట్టిన మనిషి విరహతాపాన్ని పొందాలె. మా ఆవిడ పూర్వకాలం మనిషి కావటంచేత ఆవిడ కెప్పుడలా విరహతాపం కలుగలేదు. నేను కలిగించాలని ప్రయత్నమూ చేయలేదు.

సత్య ప్రణయ కలహంపట్టి ఏమి చేసిందో నాకు తెలియక పోలేదు. ముందు భరింపరాని విరహబాధ పడ్డది. అంతబాధ మా ఆవిడకు కలుగుతుందని నాకు ఏ మాత్రం నమ్మకంలేదు. దాని తరువాత చెలికత్తెలు ఆమెకు చందన

గంధం పూసి, విసన కర్రలతో విసరాలె. ఇదంతా మహా ఇంట్లో సాగదు. మాది సామాన్య సంసారం. చెలికత్తెలు లేరు ఒక్క పనిచేసే మనిషితప్ప. అదైనా ప్రొద్దున్నే వచ్చి ఒక గంటఉండి పోతుంది కాబట్టి ప్రణయ కలహం మాఇంట్లో జరగటానికి అట్టే అవకాశం లేకపోయింది. నేనైనా పట్టుబట్టి ఆవిడచేత ప్రణయ కలహం పట్టించనూ లేదు.

ప్రణయ కలహం పట్టిన మనిషి మెడలో ఉన్న ముత్యాలహారాలు తెంపి పోయాలె. మా ఆవిడ మెళ్లో ముత్యాలహారా లున్నయ్యా? ఆ తరువాత ఆమె కోప గృహంలో పడుకోవాలె గదా! మా ఇంట్లో కోపగృహం ఏదీ! ఇవన్నీ మా ఇంట్లో లేవు కాబట్టి నిజమైన ప్రణయ కలహం జరగటానికి అసలు వీలేలేదు అంటారేమో! అల్లాఅంటే నేను ఒప్పుకోను.

మెడలో ముత్యాలహారాలు లేనిమాట నిజమే కాని ఆ ఉన్న ఒక్క గొలుసూ తెంపుకోవచ్చు. కోపగృహం లేకపోతే వంటఇంట్లోనే పమిటిచెంగు పరచుకొని పడుకోవచ్చు. చెలికత్తెలు లేకపోతే పనిచేసే మనిషితో సరిపెట్టుకోవచ్చు. కాబట్టి ప్రణయ కలహాలు పట్టటానికి వీల్లేక పోలేదు.

కాని నేనే అటువంటివి మనకొద్దు అని ఊరుకొన్నాను. మా ఆవిడ ప్రణయ కలహం పట్టిందే అనుకోండి. పట్టి నా మీద కోపం తెప్పించుకొని తలుపు బిడాయించుకొని పడుకుంటుంది. అప్పుడు నా గతి ఏం కావాలె! తెల్లవార్లూ బైట అరుగుమీద చలిలో వణుకుతూ పడుకోవలసిందేకదా!

అదీగాక తీరా ఆవిడ ప్రణయ కలహంపట్టి సక్రమంగా నడిపి, మాసిన చీరగట్టుకొని మౌనము దాల్చి నిరస్తవిభూషయై పడుకొన్న తరువాతా, పిల్లలకు అన్నం ఎవరు పెడతారు! అప్పికి అంట్లు ఎవరేస్తారు! ఇల్లూ వాకిలీ ఎవరు తోడుస్తారు?

ఇల్లాంటిది ఎప్పుడో ఒక్కసారి జరిగితే, ఎల్లాగో సరిపెట్టుకు పోవచ్చు. మనవాళ్ళకు ఇల్లాంటిది ఒకసారి నేర్పామూ అంటే, వాళ్లు దాన్ని వదలరు. ఇంటికి ఆలస్యంగా వచ్చినప్పుడల్లా చటుక్కున ప్రణయ కలహం పట్టేస్తారు! అదే అలవాటైపై రెండురోజుల కొకసారి కోపగృహంలో ప్రవేశించి, ఆ ఉన్న ఒక్కగొలుసూ, ఘటికీ ఘటికీన తెంపుతూ ఉంటే ఎల్లాగ?

ఈ కారణాలచేత నేను మా ఆవిడచేత ప్రణయ కలహం మటుకు పట్టించలేదు. ఆవిడ పట్టనూలేదు.

6

ఆ తరువాత రెండేళ్లు గడిచినై. మా కాంతం ప్రణయ కలహాలు కాక, సిసలైన జాతీయ కలహాలు నేర్చుకొంది. మొదటి రోజులలో అవికూడా సరదాగానే ఉండేవి.

మనము సముద్రస్నానానికి వెళ్లి ఒడ్డున నడుంలోతున నుంచుని ఉన్నప్పుడు, అలలు ఎదురొచ్చి నవ్వుతూ మనలను నెవక్కి-తోస్తాయి. ఆ మాత్రంచేత ప్రమాదం ఏమీలేదు. మనలను గట్టిగా పట్టుకొని, భూమిమీదనుంచి లేవనెత్తి ఉక్కిరి బిక్కిరిచేసి, బాధించి, కోపంతో సముద్ర మధ్యంలోకి ఈడ్చుకు పోయే భయంకరమైన తరంగాలు కావు అవి. అల్లాగే మావి పోట్లాటలే అయినా అవికూడా ఓ విధంగా ప్రణయ లీలలకిందే లెక్క-.

మా పక్క-ఇంట్లో సుందరమ్మగారు కాపురం ఉన్నారు. ఆవిడ మా ఇంటికి అప్పుడప్పుడువచ్చి కాసేపు కూర్చుని మా ఆవిడతో మాట్లాడి పోవటం కద్దు.

ఒక శనివారం అది. నేను ఆ రోజు మధ్యాహ్నం కాస్త నిద్రపోతున్నాను. నేను నిద్రలో ఉండగానే మధుర

మైన కంఠస్వరం ఒకటివినిపించింది. ఎవరా అని ఆశ్చర్యంతో నేను లేచి కిటికీలోనుంచి చూశాను. సుందరమ్మ ఒక్కతే అక్కడ కూర్చుని కూనిరాగాలు తీస్తున్నది. ఇదివరకు ఆమెను నేను చాలాసార్లు చూశానుగాని ఎప్పుడూ ఆవిడ అంత అందంగా కనుపించలేదు. మంత్రముగ్ధుణ్ని అయి అల్లాగ చూస్తూ నిలబడి పోయినాను. ఎటునుంచి వచ్చిందో మాఆవిడ వచ్చి నావెనకాల నిలబడిఉంది నేను ఇటు తిరిగిచూచే సరికి. నేను చేస్తున్న దొంగపనికి సిగ్గుపడి తలవంచుకొన్నాను. ఆమె కొర కొరలాడి వెళ్ళిపోయింది.

కాని ఆవిడ కోపం అంతటితో పోలేదు. రోజు రోజెల్లా ఆమె ధుమ ధుమ లాడుతునే ఉంది. ఆ రాత్రి అన్నం తినేటప్పుడు నేను కావలసింది అడగటం, ఆమె మాట్లాడకుండా వడ్డించటం జరిగింది.

భోజనం అయిపోయి నేను మేడ పై గదిలోకి వెళ్ళి కూర్చున్నాను కాంపోజిషన్ పుస్తకాలు ముందు వేసికొని ఆమెరాకకై నిరీక్షిస్తూ. మామూలుగానే వచ్చిందికాని నా పక్కన కూర్చోలేదు. నాకు తమల పాకుల చిలకలు చుట్టి ఇవ్వనూలేదు. తమల పాకుల పళ్ళెం బల్లమీద పెట్టి ఊరుకొంది. పక్కమీదనున్న మాసిన దుప్పటి తీసివేసి

కొత్తమప్పటి వెయ్యలేదు. మంచినీళ్ళ చెంబుమాత్రం మంచంక్రింద పెట్టింది. కిటికీలోనుంచి గాలి కోపంగా వీయ సాగింది నేను దిద్దుతూఉన్న కాంపోజిషన్ పుస్తకాలవంక ఆవిడ చూడనైనా చూడక పోవటంవల్ల అవి గిలగిల కొట్టు కొన్నాయి పాలకోసం ఏడ్చే పసిపిల్లలాగ. నా గదికిపైట ఉన్న వసారాలో ఒక చిన్నపట్టె మంచంమీద వేరే పక్క కూడా వేసిఉంది.

సంగతి గ్రహించటానికి ఆటేసేపు ఆలోచించ వలసిన అగత్యం లేకపోయింది. నా పక్కమీద నేను పడుకొన్నాను. అప్పటివరకు విసురుగా వీస్తున్నగాలి చటుక్కున ఆగిపోయింది. కాసేపు ఉక్కపోసీ, నల్లులు కుట్టీ, నిద్రపట్టింది కాదు.

మర్నాడు ప్రొద్దున నేనులేచి చూసేసరికి బాగా మబ్బు పట్టిఉంది. కొద్దిగా చినుకులు కూడా పడటం సాగినై. ఏమంత ఉషారుగా లేదు. రోజల్లా ఇంట్లోనే ఉండి పోయి నాను ఏదో చదువుకొంటూ. సాయంత్రంమటుకు కాస్త ఏటికి వెళ్ళి అటూ ఇటూ తిరిగి పెందలాడే ఇంటికి వచ్చే శాను.

మా ఆవిడ ఇంకా ముడుచుకొనే ఉంది. ఆవిడకు అంత కోపం రావటం మటుకు నాకేమాత్రం బాగుండలేదు.

పరస్త్రీని కన్నెత్తి చూడటమే అంత తప్పనా? ఆవిడను నేను పలుకరించానా మాట్లాడానా? ఏమీలేదే? ఎందుకో అంతకోపం నాకు అర్థంకాలేదు! నిజానికి ఇంకొకరిపంక చూస్తే, మా ఆవిడగారికి ఇంతకోపం వస్తుందని నాకు తెలి యదు.

ఇంత ముణుచు కోకపోతే, ఈవిడ మటుకు, నా దగ్గర కొచ్చి "ఎందుకండీ ఆలాగ దొంగతనంగా ఆవిడపంక చూస్తారు? తప్పు అల్లాగ చూడకూడదు" అని చెపితే నేను వినక పోయివానా! ఈ కాస్తదానికి ఇంత గడబిడ చేయటం బొత్తిగా దౌర్జన్యం అని పించింది.

నేను యింటికి రావటంతోనే గబగబా వంట ఇంట్లోకే పోయి కాంతాన్ని చూచి పలకరించి రావటం మామూలు. ఆ రోజున నేను వెళ్ళలేదు. మాట్లాడకుండా, స్నానంచేసి గదిలో పుస్తకం తెరచి ముందుపెట్టుకు కూర్చున్నాను. ఆ తరువాత కాసేపటికి ఆవిడవచ్చి, "వంట అయింది భోజనానికి లేవవచ్చు" అన్నది. నేను అన్నాను "అక్కర్లా" అని.

ఏం?

నాకు ఆకలిగా లేదు.

ఎందుచేతా ?

ఎందుచేత అండీ అక్కర్లేక పోవటం ? కాఫీహోటల్లో తిన్నారా ?

ఊహు.

అయితే లేవండి కొద్దిగా తినవచ్చు.

నాకు తినాలని లేదు.

అయితే నాకూ తినాలని లేదూ.

ఇల్లా అని ఆవిడ వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆ రోజల్లా మేమిద్దరం ఒక్కమాట అయినా మాట్లాడుకో లేదు. తప్పుకు తప్పుకు తిరిగాము. ఈ స్థితి నా కెంత కష్టంగా ఉందో ఆవిడకూ అంత కష్టంగా ఉండీ ఉంటుంది. ఆవిడే దారికొస్తుంది. నేనూ తొందర పడకూడదు. మగవాడిని అయినందుకు కాస్త బెట్టుగానే ఉండాలె అని నిశ్చయించు కొన్నాను.

అయితే ఒక చిన్న చిక్కొచ్చింది. ఆవిడ "నేనుకూడా తినను మీరు తినకపోతే" అని వెళ్ళిపోయింది. నా మూలాన

ఆపిడను పాపం పస్తు పడుకోనియ్యడం అధర్మం, అన్యాయం కూడాను. నిజం మాటకు నాకూ ఆకలి అవుతూనే ఉన్నది. గౌరవంగానూ, నా దర్జాకు ఏమీ భంగం లేకుండానూ వ్యవహారం ఎల్లాగ కుదటబడుతుందా అని ఆలోచించాను.

ఆవిడ నిద్రపోయినతరువాత, నేను మెల్లగా చప్పుడు కాకుండా దిగిపోయి అన్నం పెట్టుకు తినవచ్చు. ఇది మొదట్లో తోచిన ఆలోచన.

ఈ ఆలోచన వచ్చినందుకు నాలో నేనే సిగ్గుపడ్డాను. వట్టి దొంగపని అది. ఆవిడ వంటింట్లో ఏదో చప్పుడు అవుతున్నదని దిగి వచ్చిచూస్తే ఎంత చులకన అయిపోతాను! పోనీ ఆవిడ వచ్చిచూడదదు. చూడకపోతే ఆవిడ సంగతి ఏమిటీ? ఆవిడ అల్లాగు పస్తు ఉండాలసిందేనా? ఛీ అని ఆ ఆలోచనను దూరంగా నెట్టేశాను.

ఏదో సమయంచూచి, అనవసరంగా కోపం పెంచుకొని ముఖం ముడుచుకొని, నా మనస్సుకు కష్టం కలిగేలాగున ప్రవర్తించినందుకు; కాస్త కోప్పడి, దాని తరువాత దర్జాగా ఆవిడను క్షమించి, ఈ వ్యవహారం పరిష్కారం చెయ్యాలె. ఇది రెండో ఆలోచన.

ఈ ఆలోచన తోచినందుకు సంతోషించాను. ఇందులో ఏమీ తప్పులేదు. అన్యాయం, అధర్మం ఏమీ జరుగదు. వ్యవహారం గౌరవంగా పరిష్కారం అవుతుంది అని అనుకొన్నాను. ఈ కార్యం వెంటనే నిర్వహిస్తే, దాని తరువాత పెండలాడే భోజనాలు చెయ్యవచ్చు. అందుకని ఈ కార్య భారం నెత్తిమీద పెట్టుకొని మేడ మెట్లు మెల్లగా దిగుతున్నాను.

ఆ సమయానికే ఆవిడా మేడమెట్లు ఎక్కుతున్నది. ఆవిడా సరిగ్గా అనుకొని ఉంటుంది "ఎందుకొచ్చిన మనఃక్లేశము ఇది! పాపము ఆయనకూ చిన్నతనమే. ఆయన కొంటె తనానికి అల్లాగ చూచినా పెద్ద ప్రమాదం ఏమీ జరుగలేదు. అల్లాగ చూడకూడదని చెప్పుకొని నావైపుకు తిప్పుకోవాలె". ఇల్లాగ అనుకొని ఆవిడా కార్యభారం నెత్తి నేసుకొని పైకి వస్తున్నది మేడమెట్లు మెల్లగా ఎక్కుతూ.

మధ్యనే ఇద్దరు తారసిల్లాము. ఒకరి మొగము ఒకరు చూచుకునేసరికి ఇద్దరికీ మళ్లీ పట్టుదలలు వచ్చినై. ఆవిడ చెప్పదల్చుకొంది ఆవిడా చెప్పలేకపోయింది. నేను అనుకొన్న దంతా నేనూ అనలేకపోయినాను. అల్లాంటప్పుడు ఎవరి దారిని వారు తలవంచుకొని వెళ్లటమే మంచిదని.

కాని మేడమెట్లు ఇరుకైనవి. అట్టే వెడల్పులేదు. ఆవిడ పై గదిలోకే పోవాలనుకొంటే నన్ను రాచుకొని ఒక పక్కకు కాస్త నెట్టి తోసుకుపోవాలె. అల్లా చెయ్యాలన్నా వీలులేదు. ఎందుచేతనంటే ఆమె మడిగట్టుకొని ఉంది.

అందుకని ఆవిడ అన్నది, "కాస్త తప్పుకోండి నేను పైకి వెళతాను" అని. తప్పుకోటం అంటే నేను వెనక్కి తిరిగి మళ్లీ పైకి పోవాలె. అంతపని నేను ఎందుకు చెయ్యాలను కున్నాను. "నేను తప్పుకోను" అన్నాను కోపంగా.

"నేను మడిగట్టుకొన్నాను. మిమ్మల్ని తాకితే మైల బడతాను అందుకని కాస్త తప్పుకోవాలె."

"నేను తప్పుకోను."

"ఎందుకు తప్పుకోరూ!" ఆవిడగారిని చీవాట్లు వేయటానికి ఇదే సమయమని తోచింది. కనుబొమలు చిట్లించి, గంభీరంగా, కోపంగా, అన్నాను పెద్దగా కంపిస్తున్న గొంతుకతో.

"నేను ఫూల్‌నుకు దారి ఇవ్వను"

"పోనీ నే నిస్తాను" అంటూ ఆవిడ గిరుక్కున తిరిగి క్రిందికి పోతున్నది.

నేను నిర్ఘాంతపోయి అట్లాగే నిలువునా నిలబడిపోయి నాను ఏమిటి ఆవిడ అన్న ముక్కకు అర్థం అని ఆలోచిస్తూ. ఒక్క నిమిషానికి అర్థం స్ఫురించింది.

నన్ను ఫూల్ అన్నా చాలా చమత్కారంగా అన్నదని సంతోషించి పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆమెను కౌగలించు కొన్నాను. "మడి చెడకొట్టారు" అన్నది.

"ఫరవాలేదు వడ్డించు. ఇద్దరం ఒకేసారి భోజనం చేద్దాము" అన్నాను.

7

కాలం గడిచినకొద్దీ మా ఇద్దరిమధ్యా ఉన్న పరిచయం స్నేహంగానూ, స్నేహం స్నిగ్ధమైన ప్రేమగానూ మారిన కొద్దీ కాంతంలో దాగిఉన్న కొంత విచిత్ర ప్రకృతి బైటపడ సాగింది. మొదటి రోజుల్లో కొత్తవల్లా, సిగ్గునల్లా ఆమె విస్తారం మాట్లాడేదికాదు. పాతబడ్డతరువాత ఆమె సంభాషణ కొత్త మెరుగులు పెట్టుకొంది. కొత్త అందాలు తెచ్చుకొంది.

ఆమె సౌందర్యాన్ని, ఆమె శరీరంలో ఉండే అందమైన వంపులను, రేఖలను, కోమలత్వాన్ని చూచి ఆనందించేవాణిని నేను మొదటిరోజులలో. తరువాత, తరువాత వాటికంటే ఆమె చీత్కారాలలోనూ, చీదరింపులలోనూ, సాధింపులలోనూ ఉన్న, ఉక్తి వైచిత్రియం, చమత్కారం, మాధుర్యం, నన్ను ఆకర్షించినవి.

నేను తల దువ్వుకొంటున్నాను. నా జుట్టు బిరుసు. అణిగి పడి ఉండదు. అందుకని దువ్వెనతో చాలాసేపు దువ్వుతున్నాను. ఆ సమయంలో కాంతం నన్నుజూచి

నేను నిర్ఘాంతపోయి అట్లాగే నిలువునా నిలబడిపోయి నాను ఏమిటి ఆవిడ అన్న ముక్కకు అర్థం అని ఆలోచిస్తూ. ఒక్క నిమిషానికి అర్థం స్ఫురించింది.

నన్ను ఫూల్ అన్నా చాలా చమత్కారంగా అన్నదని సంతోషించి పరుగెత్తుకుంటూ వెళ్లి ఆమెను కౌగలించు కొన్నాను. "మడి చెడకొట్టారు" అన్నది.

"ఫరవాలేదు వడ్డించు. ఇద్దరం ఒకేసారి భోజనం చేద్దాము" అన్నాను.

7

కాలం గడిచినకొద్దీ మా ఇద్దరిమధ్యా ఉన్న పరిచయం స్నేహంగానూ, స్నేహం స్నిగ్ధమైన ప్రేమగానూ మారిన కొద్దీ కాంతంలో దాగిఉన్న కొంత విచిత్ర ప్రకృతి బైటపడ సాగింది. మొదటి రోజుల్లో కొత్తవల్లా, సిగ్గువల్లా ఆమె విస్తారం మాట్లాడేదికాదు. పాతబడ్డతరువాత ఆమె సంభాషణ కొత్త మెరుగులు పెట్టుకొంది. కొత్త అందాలు తెచ్చుకొంది.

ఆమె సౌందర్యాన్ని, ఆమె శరీరంలో ఉండే అందమైన వంపులను, రేఖలను, కోమలత్వాన్ని చూచి ఆనందించేవాణ్ణి నేను మొదటిరోజులలో. తరువాత, తరువాత వాటికంటే ఆమె చీత్కారాలలోనూ, చీదరింపులలోనూ, సాధింపులలోనూ ఉన్న, ఉక్తివైచిత్రియం, చమత్కారం, మాధుర్యం, నన్ను ఆకర్షించినవి.

నేను తల దువ్వుకొంటున్నాను. నా జుట్టు బిరుసు. అణిగి పడి ఉండదు. అందుకని దువ్వెనతో చాలాసేపు దువ్వుతున్నాను. ఆ సమయంలో కాంతం నన్నుజూచి

నవ్వింది. నే నేగో షోకు జేసుకొంటున్నానని ఆమె అనుకొన్నది. "ఎందుకూ నవ్వుతున్నావు?" అని అడిగాను. కాంతం నవ్వు ఆపుకొని "ఏమ్బే, ఏంలేదు. ఎంత సేపు దువ్వినా ఉన్న అందంకంటే కొత్తది రాదుకదా" అని నవ్వుతూనే నన్నది. నే నన్నానూ "అది కాదు కాంతం, ఈ జుట్టుకు నీ గుణమే అబ్బింది. ఎంత దువ్వినా లొంగటంలేదు" అన్నాను. "లొంగ కేంజేస్తుందండి" అంటూ ఆవిడ వచ్చి, కాస్త చెయ్యి తడి చేసుకొని, రుద్ది, పాపటదీసి చక్కగా దువ్వింది. అప్పుడు మళ్లీ అన్నది "చూశారా, లొంగతీసుకొనే విధం తెలియక పోతేసరి" అని. నిజానికి లొంగదీసుకొనే విధం ఆవిడకు తెలిసినంత బాగా నాకు ఎప్పుడూ తెలియలేదు. నేను అప్పటికి ఇప్పటికీ అంతే.

లొంగతీయటం అంటే జ్ఞాపకం వచ్చింది మేము భీమవరంలో ఉండంగా మాకు ఓ పోట్లావు ఉండేది. పాలు తీయటానికి దాని దగ్గరకెడితే అది బుసలు కొడుతూ పొడవ వచ్చేది. దాన్ని ఎల్లాగయినా మచ్చిక చేసుకోవాలెనని మా ఆవిడ నానా అవస్థలూ పడుతూఉండేది. ఆవిడ దాని దగ్గరకు వెళ్లినప్పుడల్లా నేను ప్రాణాలు బిగబట్టుకొని చూస్తునే వాడిని. అది ఆవిడను ఎక్కడ కుమ్మేస్తుందో నన్న భయంతో.

మా ఆవిడ ఎంత ప్రయత్నించినా అది ఎన్నాళ్లకూ స్వాధీనం కాకపోవటం చూచి చివరకు నే నన్నానూ, "కాంతం ఈ పోట్లగొడ్డును పెట్టుకొని మనం ఎన్నాళ్లు కాపరం చేయగలం? దీన్ని అమ్మేద్దాము."

"అవ్వ—అదేమిటండీ అల్లా అంటారూ? పాడి గొడ్డును అమ్ముకొంటారుటండీ పోట్లదైతేనుటుకూ! ఆ మాటకొస్తే నేను మిమ్ముల్ను పెట్టుకు కాపరం చెయ్యటంలేదా?" అన్నది మా కాంతం.

నన్ను పోట్లగొడ్డుతో పోల్చినందుకు కష్టంవేసి నే నన్నానూ "అయితే కాంతం నేనూ పోట్లగొడ్డు. నే అంటావా?" కాంతం ముసి ముసి నవ్వులు నవ్వుతూ అన్నది "కాకేమండీ మీరుమటుకు మొదటి రోజుల్లో ఒక్కతీరాన స్వాధీన మైనారా? ఇంతకంటే ఎక్కువగానే బుసలుకొట్టారు. ఓపికపడితే ఎంత పోట్లగొడ్డు అయినా లొంగుతుంది.

ఓపిక ఉండాలట! అది ఆవిడ అనేమాట. ఇంకో సందర్భంలోకూడా ఇల్లాగే ఓపిక ఉండాలని చెప్పింది. ఏమిటా అంటే ఒకరోజు నేను నా ఫౌన్‌టెన్‌పెన్ కనపడక, వెతుక్కొని వెతుక్కొని విసిగి చివరకు అడిగాను, "ఏమే కాంతం నా పెన్ ఏమైనా చూచావా?" అని.

"మీ వస్తువులు ఏవి ఎక్కడ పెట్టుకొంటారో నాకు ఏం తెలుస్తాయండీ? అయినా మీ పెన్‌తో నా కేంపని? నామటుకు నేను అరగంటనుంచీ వెతుక్కుంటున్నాను అట్ల కాడ కోసం. ఏంజేసేది చెప్పండి. వెతగ్గా వెతగ్గా ఇప్పటికి దొరికింది. మీరూ వెతుక్కోండి ఓపిగ్గా" అని హితవు చెప్పింది.

నవ్వుతూ అన్నమాటలే అయినా ఎంత నిగూఢమైన సత్యం ఉంది ఆమె మాటల్లో! జీవితంలో ఓపిక ఉండాలట! ఓపిక ఉంటే పోట్లగాండ్లూ లొంగుతై. పోయిన వస్తువులూ దొరుకుతై! రామాయణంలో ఇంతకంటె గొప్ప సత్యాన్ని చెప్పలేదు వాల్మీకి! సీత పద్నాలుగేండ్లు వనవాసం చేసింది. జీవితం, జీవితం అంతా ఓపికపట్టింది. మా ఆవిడా ఆమాటే చెప్పింది ఓపిక ఉండాలని.

8

నేనొక సందర్భంలో అన్నానూ, నా కథలు మెచ్చు కోసి వ్యక్తులతో నేను సాధారణంగా స్నేహం చెయ్యను కాని ఇద్దరున్నారు. వాళ్లు నా కథలు ఎప్పుడూ మెచ్చుకోరు. అయినా నేను వాళ్లను ఎక్కువగా గౌరవిస్తానూ అని! అందులో ఒకరు విశ్వనాథ సత్యనారాయణగారు, రెండవది నా భార్య!

ఆ మాట సత్యం. అవిడ నా కథలు బాగున్నాయని ఎప్పుడూ అనలేదు. నాకు ప్రపంచంలో ఉన్నతస్థానమూ, గౌరవమూ వస్తుందనే నమ్మకం ఆవిడకు ఎప్పుడూలేదు. కాని నేనుమటుకు ఏవో ఆశలు పెట్టుకొనేవాడిని. ఎవరైనా ఏ సభకన్నా పిలిస్తే తప్పక వెళ్లేవాడ్ని నేనే కర్చులుపెట్టుకొని. నేను పిచ్చిన పడుతున్నాననీ, ఇల్లా ఉపన్యాసాలు ఇచ్చినంత మాత్రాన పేరు ప్రతిష్ఠలు వస్తాయన్నమాట భ్రమ అని ఆవిడ అంటూఉండేది.

ఆంగ్ల సాంప్రదాయం ప్రకారం ఏప్రిల్ మొదటి తారీఖు ఆల్ ఫూల్సుడే. ఆ రోజున పెద్దా, చిన్నా అనే భేదం

లేకుండా ఒకర్ని ఒకరు హాస్యం ఆడుకోవచ్చు. నేను ఒకరి మీదకు వెళ్లటం ఎందుకు మా కాంతాన్నే హాస్యం పట్టిద్దామని అన్నాను, "కాంతం నీవు పుట్టింది ఏప్రిల్ ఫస్టుగా. ఇవ్వాళ నీ పుట్టినరోజు పండుగ కావాలు." ఏప్రిల్ ఫస్టున పుట్టినవాళ్లంతా ఫూల్సు. కాంతంకూడా ఫూల్ అవుతుంది. ఇల్లాగ ఒక చిన్న విసురు విసిరాను. ఆమెకు అర్థమై నా సరసాన్ని గ్రహిస్తుంది అన్న నమ్మకంతోనే.

ఆమె చిన్నతనంలో కొన్నాళ్లు స్కూలులో చదువు కొన్నది. అందుకని ఇట్టె గ్రహించి నవ్వింది. ఆ తరువాత అన్నది "నేను ఏ రోజున పుట్టానో నాకుమటుకు జ్ఞాపకంలేదు. కాని మీ కథలు విన్నవాళ్లంతా—ఏమమ్మా నీవు ఏప్రిల్ ఫస్టున పుట్టావా? అంతే అయి ఉంటుంది, లేకపోతే అల్లాంటి పిచ్చి కథలను వ్రాసే ఆయనను చూస్తూ, చూస్తూ, ఎందుకు పెండ్లి చేసుకొన్నావ్! చేసుకొన్నా ఎందుకు కాపరం జేస్తావ్! అంటున్నారండీ" అని విరగబడి నవ్వింది.

అల్లాంటి కథలను వ్రాసే ఫూల్‌తో కాపరం చేస్తున్నావు కాబట్టి, నీవు అంత కాకపోయినా ఏప్రిల్ ఫస్టున పుట్టిన ఫూల్‌వు అయివుండాలని వాళ్లుఅన్నారన్న మాట. పోనీ ఇద్దరం ఫూల్సుమైనాము తగాదా లేకుండా. సరసానికి అన్నదే మాట. కాని నిజానికి ఆవిడ అభిప్రాయంకూడా అంతే

నా కథలనుగురించి. అల్లాంటప్పుడు నేను ఉన్నతస్థితికి వస్తానని ఆమెకు నమ్మకం ఎల్లా ఉంటుంది! ఆ మాటే అన్నది చమత్కారంగా ఒకసారి.

అదేమిటి అంటే గుడివాడలో ఒకసారి ఓ పెద్దకవికి సన్మానం జరిగింది. ఆ సందర్భంలో జరిగే పండితసభకు నన్నుకూడా ఆహ్వానం చేశారు. మా కాంతాన్ని పిలిచి నేను కాస్త గుడివాడదాకా వెళ్లివస్తాను అన్నాను.

"ఇప్పటినుంచీ వెళ్లకపోతేనేం?"

"అక్కడ కవిగారిని ఏనుగ ఎక్కిస్తారు."

"అయితే మీరెందుకూ వెళ్లటం?"

"ఉత్సవం చూస్తాను"

"మిమ్మల్నికూడా దేనిపైనన్నా ఎక్కిస్తారా?"

ఇల్లాగ వెటకారంగా అన్నది. "ఆయనకు ఇంత పెద్ద గౌరవం హఠాత్తుగా ఒక్క దెబ్బలో రాలేదు? అనేక సభలకెళ్ళి, చిన్న చిన్న గౌరవాలను పొంది చివరకు ఈ గొప్పగౌరవాన్ని పొందుతున్నాడన్న ఉద్దేశంతో నేనుఅన్నాను." "అది కాదే పిచ్చిదానా ఆయన ఇదివరలో ఎన్నో ఎక్కిఎక్కి చివరకు ఏనుగ ఎక్కుతున్నాడు. నేను ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నాను.

కొన్నాళ్ళపాటు ఇల్లాగ అయిన తరువాత, నేనూ తప్పకుండా ఏనుగెక్కుతాను" అని ఆవిడకు ధైర్యం చెప్పాను.

గుడివాడ వెళ్లాను. సభలో నేనుకూడా కాసేపు మాట్లాడాను. ఆ రాత్రికే ఇంటికి వచ్చేశాను. భోజనాలు అయిన తరువాత మాట్లాడుకోటంలో ఈ ప్రసంగం వచ్చింది. గుడివాడ సభనుగురించి కబుర్లు చెప్తున్నాను. ఇల్లా అన్నాను.

"నీవు చెప్పినమాట నిజం అయిందే కాంతం. అక్కడ నన్ను మొదట్లో ఎవ్వరూ గౌరవించలేదు. చివరకు ఎవరో వచ్చి, మీరూ మాట్లాడండి అని బలవంత పెడితే మాట్లాడాను."

"వాడెవరో మీ దగ్గర చదువుకొన్న విద్యార్థి అయి ఉంటాడు."

"కావచ్చు" అని నవ్వాను. నిజంకూడా అదే. ఒకొ్కక్కప్పుడు ఆవిడ చూచినట్లు చెప్పేస్తుంది ఎక్కడో జరిగిన విషయాలను గురించి.

"అయితే మిమ్ములను చూచి, వాళ్లు ఆహ్వానించి కుర్చీ ఇవ్వలేదండీ?"

"ఇవ్వలేదు. చాలామందిమి అల్లాగే ఎక్కడ జడితే అక్కడ నుంచున్నాము సభావేదికకు దూరంగా."

"ఆయన చెప్పినదంతా వినబడ్డదామరి?"

"మొదట్లో వినబడకపోతే దగ్గరలో ఉన్న ఒక గోడ ఎక్కి కూర్చుని విన్నాను."

కాంతం ఈ మాటమీద నవ్వి, "ఇంకేం ఏదో ఒకటి ఎక్కారు. ఇహ ముందు మీకు ఇంకా, ఇంకా ఉన్నతస్థానాలు లభిస్తయ్యి లెండి" అంది వెటకారంగా.

ఆవిడ అన్నమాట అక్షరాలా నిజమే అయింది. ప్రజలు నా కథలను మెచ్చి నన్ను దేనిపైన ఎక్కించలేదు. ఆవిడన్నట్లు మొన్న చాలకొల్లులో గోపురం నేనే ఎక్కాను. ఆవిధంగా ఉన్నతస్థానం లభించింది. నా కథలు పిచ్చికథలుగానే ఉండిపోయినాయి ప్రజల దృష్టిలో.

9

జీవితంల్లో ఆనందాన్ని ఇచ్చేది ఒక్క సౌందర్యమే కాదు. నిశితమైన మేధాశక్తి, చమత్కారమైన మాట పొందికా కూడా కావలసినంత ఆనందాన్ని ఇస్తవి.

ఒకసారి మా అబ్బాయి ఏడుస్తూ ఇంటికి వచ్చాడు బడినుంచి. "ఏంరా నాయినా ఎందుకూ ఏడుస్తావ్రా" అని అడిగింది వాడితల్లి. "స్కూలులో మాస్టరు కొట్టేడే అమ్మా" అన్నాడు. "ఎందుకు కొట్టాడురా నాయినా" అని బుజ్జగించి అడిగితే వాడు చెప్పాడు, "నే నేమీ అల్లరి చేయలేదే అమ్మా, మాస్టరుగారూ చైనా ఎక్కడుందో చెప్పమన్నారు. నేను చెప్పలేకపోయినానే. ఆపళంగా కొట్టారే" అని బావురు మని మళ్లీ ఏడ్చాడు. ఇది విని "ఎందుకే అబ్బాయి ఏడుస్తు న్నాడూ?" అని అడిగాను నేను.

"ఆ మాస్టరుకు చేతు లెల్లావచ్చినయ్యో అనవసరంగా కొట్టాడుటండీ పిల్లవాడ్ని! చైనా ఎక్కడుందో చెప్పమన్నా డట. వీడు చిన్నవెధవాయె! ఎక్కడపెట్టాడో ఏమో మరిచి పోయినాడు కామాలు చెప్పలేకపోయినాడు. ఆపళంగా

ఆ మాష్టరుకు కోపంవచ్చి కొట్టేశాట్టండి! చూశారా!" అని అన్నది ఆవిడ నాతో. అంతటితో ఊరుకోక "ఏమిటిరా ఆ దరిద్రప్పుది? చైనా? ఏమిటది? అసలు దాన్ని నీ వెందుకు తీశావురా? నీకు ఎన్నిసార్లు చెప్పాను ఇంకోరి వస్తువ ముట్టుకోనద్దని!" అని కుర్రవాడ్ని కూడా కోప్పడ్డది.

మా ఆవిడ ఆటే ప్రమాణం చేసిన మనిషి కాదు. మద్రాసువైపు ఏస్టేషనులు ఉన్నయ్యో, కలకత్తావైపు ఏమి స్టేషనులు ఉన్నయ్యో ఆమెకు తెలియదు.

ఒకసారి నేను రాజమండ్రి పనిమీద వెడుతున్నాను. తీరా బండి ఎక్కే సమయానికి, కాంతం ఒక చిన్నజాడీలో ఆవకాయ తీసుకొచ్చి బండిలో పెట్టింది. "ఎవరికిది!" అని అడిగాను. "మా అక్కయ్యగారు ఈ సంవత్సరం ఆవకాయ పెట్టుకోలేదట. పిల్లలు చద్ది అన్నాలలోకి ఏమీలేక ఇబ్బంది పడుతున్నారు. మీరు ఎట్లాగూ వెళ్ళుతున్నారుగా! కాస్త వాళ్ళింట్లో ఇయ్యండి ఇది" అని జాలిగా బ్రతిమాలాడింది ఆవిడ.

"మీ అక్కయ్యగారు గుంటూరులో ఉండిరి. నేను వెళ్ళేది రాజమండ్రి ఆయె! ఎట్లా ఇచ్చేది?" అని అడిగాను. "దార్లోనే కదండీ స్టేషను దగ్గరనే ఆయె మావాండ్ల ఇల్లు!

ఈ బండిదిగి, ఇది ఇచ్చేసి, మళ్లా వెంటనే ఇంకో బండీ ఎక్కండి. పాపం మొన్న కబురుకూడా చేసిందండి కాస్త పంపమని! అని మళ్ళీ దీనంగా అడిగింది.

ఆపిడ అజ్ఞానాన్ని చూచి నవ్వుకొని "తీసుకెళ్ళటానికి కాదే, రాజమండ్రి దారిలో గుంటూరులేదు" అన్నాను. ఆవిడ ముఖం ఇంత జేసుకొని "పోనీలెండి. ఏం జేస్తాను పట్టుకెళ్ళకపోతే!" అంటూ జాడీ తీసికెళుతున్నది.

ఆవిడ మనస్సు కష్టపడ్డది పాపం. అందుకని అసలు విషయం విప్పి తెలిసేలాగున చెబుదామని "చూశావా కాంతం, నాకు ఈ మాత్రం తీసికెళ్ళటానికి ఇష్టం లేదనుకుంటున్నావు కామాలు! అదికాదు. నిజంగా చెబుతున్నాను. రాజమండ్రి దారిలో గుంటూరు తగలదు" అన్నాను.

ఆ! తగలకేంజేస్తుంది లెండి. ఆపేక్షలుంటే బాగనే తగుల్తుంది అని దీర్ఘాలు తీస్తూ లోపలికి వెళ్లిపోయింది ఆవిడ. ఆవిడ అజ్ఞానాన్ని చూచి నాకు జాలీ వేసింది నవ్వూ వచ్చింది.

తెలియక అన్నమాటలు ఇవి. తెలిసిన విషయాల్లో కూడా ఆమె ఒక్కొక్కప్పుడు అనే మాటలు బహు

చమత్కారంగా ఉండేవి. అవి యుద్ధపుర్రోజులు. యుద్ధ నిధి వసూలు చేస్తున్నారు ఒక్కరొక్కరి దగ్గరనుంచి ఒక అర్ధరూపాయి చొప్పున . నేనూ ఒక అర్ధరూపాయి చందా ఇచ్చాను వాళ్లకు. మా కాంతం ఇదంతా చూస్తూనేఉన్నది.

"ఎందుకండీ అర్ధరూపాయి ఇచ్చారూ?" అని అడిగింది. "మన ప్రభుత్వంవారు జర్మనీతో గొప్ప యుద్ధం చేస్తున్నారు. దానికి చాలా డబ్బు కావాలె. తలో అర్ధరూపాయి చందా ఇస్తున్నారు. నేనూ ఓ అర్ధరూపాయి ఇచ్చాను" అన్నాను.

ఆవిడ ఈ మాట విని విసుక్కొని "అర్ధరూపాయికి గతి లేనివాళ్లు యుద్ధం ఎందుకు పెట్టుకోవాలె! అంతగా డబ్బు లేకపోతే కాస్త చేతిలో డబ్బు ఆడుతున్నప్పుడే, ఇటువంటి పనులు తలపెట్టాలగాని, వెనకా ముందూ ఆలోచించకుండా లటిక్కిన యుద్ధంలోకి దిగి మనలను ఏడిపించడమటుకు ఏమంత బాగుందండీ?" అంటూ నిరసనగా మాట్లాడింది.

ఇంకో విషయంలోకూడా ఇల్లాగే అమాయకంగా పెంకిగా అన్న మాటలు నాకు తల్చుకొన్నప్పుడల్లా నవ్వు వస్తూ ఉంటుంది. కొత్త పైము వచ్చినతరువాత జరిగిన విషయం ఇది.

ఓ రాత్రివేళ నాకు మెళకువ వచ్చింది. ఆవిడ కూడా మేలుకొంది. ఇద్దరం మాట్లాడుతూ కూర్చున్నాము. ఇంతలో దొరగారి బంగళాలో గంటలు కొట్టారు.

“ఎంత అయిందండీ టైము? ఎన్ని ఇప్పుడు కొట్టింది?” అని అడిగింది మా ఆవిడ.

“రెండున్నర అయింది.”

“రెండున్నరా అయింది! అయితే క్రొత్త టైముప్రకారం రెండున్నరైతే మూడు కొట్టాలగదండీ! మరి రెండే కొట్టారేం?” అని అడిగింది.

ఈ ప్రశ్నకు ఏమి చెప్పాలిసింది తోచలేదు. రెండు అయితే మూడు కొట్టాలట! చివరకు ఆలోచించి ఇల్లా అన్నాను. “అవుచే కాంతం ఇప్పుడు పాతటైము ప్రకారం ఒకటే అయింది అన్నమాట.” ఈ మాట విని ఆమె తృప్తి పడక “నా బొంద. ఒకటైతే రెండు కొట్టటం ఏమిటండీ వాడి శ్రాద్ధం” అని అసహ్యించుకొన్నది.

ఇది అర్థంలేని వెంకిమాట. ఒక్కొక్కప్పుడు మెరుపు లాంటి మేధాశక్తితో తర్కిస్తుంది అనేస్తుంది. దానితరువాత ఆ దెబ్బకు తట్టుకొని, నవ్వే శక్తి ఉంది కాబట్టి నేను నవ్వుకొని ఊరుకొనేవాడ్ని.

విశ్వనాథ సత్యనారాయణ దగ్గరకు ఒకసారి నేను వెళ్లాను. ఆ రోజులలో ఆయన 'జయంతి' అనే పత్రిక నడిపి, కొన్ని కారణాలవల్ల దాన్ని ఆపేశారు. పత్రిక నడపటంలో ఉండే కష్టసుఖాలు ఆయనకు బాగా తెలిసినై. సాహితి అనే పత్రికకూడా అల్లాగే ఆగిపోయి ఉన్నది అప్పటికి.

సాహితీ పత్రికను నేను తీసుకొందామని అనుకొన్నాను. అనుకొని పత్రిక నడపటంలో ఉండే మెలకువన్ని తెలుసుకొందామని సత్యనారాయణగారి దగ్గరకువచ్చి, ఆయనతో అన్నాను "ఏమండీ నేను సాహితీ పత్రిక నడపుదామని అనుకొంటున్నానండీ" అని.

ఆయన చప్పున "సీ వేమైనా ఫూల్ వా" అని అన్నాడు. అప్పటికి నాకూ ఆయనకు అట్టే పరిచయంలేదు. అయినా ఇంతమాట ఆయన స్వతంత్రించి అన్నాడు.

సరే అయిపోయింది, ఇంటి కొచ్చేశాను. సత్యనారాయణగారు ఇంత మాట అన్నారే అని మనస్సులో కష్టంగా ఉంది. మా ఆవిడకు సత్యనారాయణగారంటే ఎంతో గౌరవం. ఆయన పద్యాలు చదివి ఆనందిస్తూ ఉండేది. ఆయన గొప్ప కవి అని నాకు ఎప్పుడూ చెబుతూ ఉండేది.

మా ఆవిడ నా కథలను ఏమాత్రం మెచ్చుకోకపోవటం, నా ఎదటే ఆయనను అంత ఎక్కువగా పొగడటం నాకు బొత్తిగా గిట్టేదికాదు.

నా మనస్సు చివుక్కుమన్నట్లు, నన్ను ఆయన ఇంతమాట అన్నాడు అని చెప్పినమీదనైనా, మా ఆవిడకు సత్యనారాయణగారి యందుండే గౌరవభావం కాస్త తగ్గుతుందా అని యోచించి, ఒక రోజున కాంతంతో అన్నాను "చూశావా కాంతం, నువ్వేదో ఆయనను మెచ్చుకొంటావుగాని, ఆయన మర్యాద తెలిసిన మనిషి కాదూ" అని. "ఏం? ఎందుకల్లా అంటున్నారు?" అని అడిగింది ఆవిడ.

విషయం అంతా చెప్పుకొచ్చాను. నాకూ ఆయనకూ పెద్ద స్నేహమూ లేదు. మాట్లాడుతున్నాము. ఎంతో సేపు కూడా కాలేదే! నాలుగైదు నిమిషాలు అయింది. నన్ను ఫూల్ అన్నాడు!!

"అంత ఆలస్యం ఎందుకైందండీ. అంత సేపు పట్టిందో ఆయనకు మీ సంగతి కనుక్కొంటానికి" అని కాంతం విరగబడి నవ్వింది.

ఇంతేకూ సత్యనారాయణగారి విషయమై ఆమెకుగల అభిప్రాయాన్ని నేను రవ్వంత అయినా మార్చలేకపోయినాను.

ఆయన వ్రాసిన కిన్నెరసాని పాటలు మటుకు ఆవిడ క్రొత్త క్రొత్త ఫణుతుల్లో పాడేది. ఆవిడ పాడుతూఉంటే నాకు నృత్యము చేయాలనిపించేది. అంత ఆనందం కలిగేది.

అయితే వారు వ్రాసిన ఇతర గ్రంథాలు ఆమెకు పూర్తిగా అర్థమయ్యేవికావు. కాకపోయినా చదివి ఆనందించేది. ఈ విషయం ఆధారంగా తీసుకొని ఒకసారి నేను ఆవిడను ఎత్తిపొడుపుగా అన్నాను.

"ఆయన వ్రాసిన గ్రంథాలు నీకు ఏమి అర్థమైనవనీ, నీవు ఆయనను మెచ్చుకొంటావు? ఆయన చాలా గొప్పకవి. అంతవాడు ఇంకొకడు లేడు అంటావ్, ఆయన ఔన్నత్యం ఏమి చూశావ్?"

"నేనేమీ చూడక్కరలేదు. నేను చూడకపోతే మటుకు హిమాలయ పర్వతాలు ఉన్నతమైనవి కావుటండీ!!" అన్నది విసురుగా.

10

మా ఇంటికి ఒకటి రెండు తెలుగు పత్రికలు వస్తాయి. పత్రికలలో కథలూ కబుర్లూ ఉంటై అనీ, ఈ విశాల ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏ యుద్ధం జరుగుతున్నదో, మానవ జాతి స్వాతంత్ర్యంకోసం ఏ మూల ఎల్లాంటి ప్రయత్నాలు చేస్తున్నదో తెలుస్తుంది. ఇతర దేశాలలో స్త్రీలు ఎంత అభివృద్ధిలో ఉన్నారోకూడా తెలుస్తాయి అని ఎన్నోవిధాల చెప్పాను మా ఆవిడకు.

ఎన్ని జెప్పినా ఆవిడ పేపరు చదివి జ్ఞానం వృద్ధిచేసుకొనేదికాదు. "ఎవ రెట్లా ఏడిస్తే మనకేం? వాళ్ల గొడవలన్నీ మన కెందుకండీ" అనేది.

"వాళ్ల గొడవలు మనకు కావాలె. ఇప్పుడు చూడు వాళ్ల యుద్ధంవల్లనే మనకు ధరలు ఇల్లాగ పెరిగిపోయినై."

"ఆ మాట తెలుసుకొంటానికి పేపరు చదవనక్కరలేదు లెండి" అని ఇల్లాగ మొండిగా జవాబులు చెపుతూఉండేది.

ఇంకా బాగా నచ్చచెబుదామని ఒక రోజున అన్నాను "కాంతం ఎంతజెప్పినా నీవు పేపరు చదవటంలేదు. నాకు

చాలా కష్టంగా ఉంది. నీవు పేపరు చదివితే అందులో ఉండే విషయాలనుగురించి ఇద్దరం సరదాగా చర్చించుకోవచ్చు. ఇందుకోసం అయినా చదువుదూ" అని బ్రతిమాలినట్లు అన్నాను.

ఈ మాట విని కాంతం విరగబడి నవ్వి "పేపర్లో విషయాలను గురించి మనం చర్చలు చేసుకోవాలటండీ. నా బొంద! మనకున్న విషయాలు చాలులెండి!" అన్నది.

"రాజకీయ విషయాలను గురించీ, ప్రభుత్వాన్ని గురించీ నాతో చర్చచేయటం నీకు సరదాగా ఉండదా?" అని అడిగాను. "సరదాకు ఆ విషయాలుకాకా ఎందుకండీ? మనకున్న గొడవలమీద కావలసినంత చర్చ జరుగుతున్నది రోజూనూ. అబ్బాయికి ఎర్రచొక్కా కుట్టిస్తానంటే మీరు నన్ను ఎర్రచొక్కా ఏమిటి, అసహ్యంగా ఉంటుంది, తెల్లని తెలుపు కుట్టిస్తానని నాతో అరగంట వాదిస్తిరి. పెద్ద అమ్మాయికి జూకాలు చేయిస్తానంటే, జూకాలు అందంకావు, స్వస్తిక లోలకులు చేయిస్తానని ఎంతసేపు కొట్లాడారు!! ఇంకా ముందు ముందు పెండ్లిండ్ల విషయంలో, కట్నాలూ కానుకల విషయంలో, అల్లుళ్లను తీసుకొచ్చే విషయాలలో అభిప్రాయ భేదాలకూ, చర్చలకూ కావలసినంత అవకాశం ఉంది. ఇంకా కొత్త గొడవలు ఎందుకులెండి" అని దీర్ఘాలు తీసింది.

అయినా నేను వదలక ఆవిడను వేధిస్తునే వచ్చాను పేపరు చదవమని. నా గోల పడలేక ఆ తరువాత పేపరు చూడటం మటుకు చూసేది. వెండి ధర, నవరసుల ధర ఆవిడ ముఖ్యంగా చూసేది. ఆ తరువాత ఎవరైనా కురవ్రాడు కనపడటంలేదు, పారిపోయినాడు అన్న సంగతులూ, పెండ్లి కొడుకు కావాలె అన్న ప్రకటనలూకూడా చదివి పేపరు అవతల పారేశేది. పోనీ ఏదో ఒకటి చూస్తున్నది. అదీ కాస్త మంచిదే. ప్రస్తుతం ఈ విషయాలు మాత్రమే చూచినా ముందు ముందు ఇంకా మంచి విషయాలను చూచి ఆమె జ్ఞానం వృద్ధిచేసుకొంటుందని నేను ఆశపడ్డాను.

కాని ఏ ముసలమ్మోవచ్చి, ఆవిడకు కలిగిన ఈ కాస్త ఆసక్తినీ పాడుచేస్తుండేది. ఓ రోజున మా ఆవిడకు పేపరు ఇచ్చి చదవమని చెప్పి, నేను బైట వరండాలో కూర్చున్నాను. ఇంతలో ఒక ముసలమ్మ వచ్చి అడిగింది ఈవిడను, "అమ్మాయీ ఇందులో ఏముంటుంది" అని. "అన్నీ ఉంటై అండి అవ్వగారూ, ఎవరు ఏమిచేసిందీ, ఎవరి కుర్రవాడు ఎప్పుడు పారిపోయిందీ, ఎవరింట్లో పెండ్లి ఈడువచ్చిన పిల్ల ఉందీ, ఇల్లాంటి సంగతులన్నీ తెలుస్తాయండీ పిన్నిగారూ" అన్నది మా కాంతం పేపరులో ఉండే విషయాలు ఇవే అయినట్టు!!

ముసలమ్మ తెల్లపోయి "అయితే అమ్మాయీ మా మనమరాలుకు పెండ్లి కావాలె. కాస్త మంచి సంబంధాలు ఎక్కడున్నాయో తెలుస్తుందా అమ్మా ఇందులో చూస్తే?" అని అడిగింది.

"ఊహు తెలియదమ్మా."

"అయితే ఎందుకమ్మా ఇదీ తగలెయ్యనా?"

"అయితే ఒకటండి పిన్నిగారూ, మా పిల్లకు మొగుడు కావాలె. పిల్ల వయస్సు ఇంత. అందంగా ఉంటుంది. ఎవరన్నా చేసుకోదల్చుకొంటే మాకు వ్రాయండి. అని పత్రికలో ప్రకటన ఒకటి చేయవచ్చు."

"పత్రికలో వేయించమంటావుటమ్మా. అల్లరి బతుకు అయిపోదూ! అప్రాచ్యులు ఎవరైనా వేయించుకొంటే వేయించుకొంటారు!"

"పోనీలెండి అవ్వగారూ. వేయించవద్దులెండి. పోనీ మీరుకూడా పేపరు చదవటం నేర్చుకోండి."

"ఎందుకమ్మా నేర్చుకోవటం!"

"అనేక సంగతులు తెలుస్తాయండీ!"

"ఏదీ ఒక్క సంగతి చెప్పు చూద్దాము?"

"కొన్ని దేశాలలో ఆడవాళ్లు పురుషులతో సమానంగా అన్ని హక్కులూ కావాలని పోట్లాడుతున్నారు. చూశారా ఇల్లాంటి సంగతులు ఎన్నో తెలుస్తయి."

ఆ ముసలమ్మ ఆశ్చర్యపడి కాంతాన్ని అడిగింది "సమాన హక్కులు అంటే ఏమిటమ్మా. ఇప్పుడు మనకు సమాన హక్కులు లేవనే అంటావా?" అని.

మా కాంతం గిరగిరా తలతిప్పుతూ "లేవండీ, మనకు సమాన హక్కులు లేవట! మనము చాలా నీచస్థితిలో అవిద్యలో అవివేకంలో ఉన్నామట!" అన్నది. "వాళ్ల బొంద! మనమేమిటి, నీచస్థితిలో ఉండటమేమిటి!—వాళ్లదే నీచస్థితి. ఏం విచిత్రమమ్మా ఇది!" అన్నది ముసలమ్మ.

"ఇంకా విచిత్రమైన విషయాలున్నాయిలెండీ అవ్వగారూ. ఇంకో సంగతి చూశారూ! ఇప్పుడు ఆడవాళ్ళు యుద్ధాలలోకూడా పోట్లాడాలని చూస్తున్నారుటండీ" అన్నది కాంతం.

ఈ మాట విని ముసలమ్మ ముక్కుపైన వేలు వేసుకొని, యుద్ధంలో పోట్లాడటమే! వాళ్ల తాడు తెగిరి!

అంత పోట్లాడాలని ఉంటే ఎవరి మొగుడితో వారు అంచక్కా పోట్లాడుకోవాలెగాని, ఇల్లు వదలి బైటపడి ఇంకొకరితో పోట్లాడుతానంటారు అదేం పొయ్యేకాలం!! అయ్యో, అయ్యో! ఇవా పేపర్లల్లో ఉండే సంగతులు! వీటిని తగలెయ్య!! మా ఆయన నన్ను చంపుతున్నారు అక్షరాలు నేర్చుకో పేపరు చదువుదుగానని. ఇంకా నయం ముందుగానే చెప్పావు!! ఇల్లాంటి సంగతులు నేర్చుకొంటానికి పేపరు చదవనక్కరలేదు" అంటూ చీదరించుకొని మాట్లాడింది.

ఈ మాటమీద కాంతం అన్నది "అల్లా అనకండి అవ్వగారూ. మీకు కావలసిన సంగతులూ ఉంటై ఇందులో" అని ఎందుకో కాంతం విరగబడి నవ్వింది.

ముసలమ్మగారు యథాలాపంగా ఆవిడ చేతులో పేపరు తీసుకొని అటు తిరగేసి ఇటు తిరగేసి, "అయితే అమ్మాయీ ఈ కాయితంలో అంతా అచ్చువేసి, ఈ కాస్త మేర వదిలేశారేం?" అని అడిగింది Stop press చూపిస్తూ.

"అక్షరాలు రాని మీబోటి ముసలమ్మలుకూడా పేపరు చూడాలంటే ఎల్లా? ఎక్కడ చూచినా ఏమీ తెలియదాయె. అందుకని ఆ కాస్తమేరా అట్టే పెట్టారు అల్లాంటి వాళ్లు చూడటానికి." అంటూ మళ్లీ కాంతం విరగబడి నవ్వింది.

పేపరు చదవటాన్ని గురించిన ప్రసంగం ఇల్లాగ వెటకారాలతోనూ, వెక్కిరింపులతోనూ వెళ్ళిపోయేది. మొత్తం మీద కాంతానికి పేపరు చదవాలనే ఆసక్తి కలుగజేయలేక పోయినాను కొన్నాళ్లయిన తరువాత "ఏం కాంతం, పేపరు చూడటం బొత్తిగా మానేసినట్టున్నావే" అని నేను అడిగితే, ఆఁ—ఎందుకు పోనిద్దురూ, ఏముంటుంది పేపర్లో. అన్నీ పిచ్చి సంగతులేనండీ, లండనుపైన బాంబులు పడ్డాయి, ఢిల్లీలో గాడిదలు ఊరేగినై, గుంటూరులో కోమటికి కడుపునొప్పి వచ్చింది, తెనాలిలో మిల్లు తగలబడ్డదీ, ఇల్లాంటి సంగతులే కదండీ! ఇల్లాంటి సంగతులు తెలిసికోకపోతే వచ్చిన నష్టం ఏమీలేదులెండి. నన్ను చంపకండి పేపరు చదవమని." అని చీత్కారంగా అన్నది.

11

మా కాంతానికి పూర్వకాలం వాళ్లు అన్నా, పూర్వ కాలపు పాటన్నా ఎంతో అభిమానం. ఇప్పటి కాలపు పాటలు ఆవిడకు ఇష్టంలేదు. ఇప్పటి కాలపు చదువులూ ఆమెకు ఇష్టంలేదు. పూర్వకాలపు మనుష్యులే మనుష్యులనీ, ఈ కాలపువాళ్లు అంతా చచ్చురకం అనీ ఆమె అభిప్రాయం.

ఈ కాలపు మనుష్యు లేముందండీ, ఇంత తినమూలేరు తిరగనూలేరు వ్రక్తి చవటలండీ అని అంటూ ఉండేది. ఏం? ఎందుచేతా? అని నేను అడిగితే పూర్వకాలపు కథలు చెప్పేది.

"భారతంలో చూడలేదండీ, గరుత్మంతుడికి ఒకసారి మాంచి ఆకలైతే తల్లిని అడిగాడట ఆహారం ఇవ్వవలసింది తల్లీ అని. ఆ మహానుభావుడికి తల్లిమటుకు ఎక్కడనుంచి తెచ్చి ఇస్తుందీ కావలసినంత ఆహారము.

ఏం? ఇంట్లో అన్నం వండలేదా ఆవిడ? పోనీ కాఫీ హోటలుకు పంపలేకపోయిందా?" అని అన్నాను నేను నవ్వుతూ.

“ఏమిటండీ గరుడుడికి కాస్త ఉప్మా తింటే ఆకలి తీరుతుందా!” అని ఆవిడ నవ్వేది. “అందుకని తల్లి ఏంజేసింది చెప్పు?” అని నేను కథ నిజంగా వినాలని కుతూహలం ఉన్న వాడిలాగ మాట్లాడేవాడిని. నిజానికి ఆ పిచ్చికథలు వినాలని నా కేమీ సరదా ఉండేదికాదు. వినకపోతే ఆమె మనస్సు కష్టపడుతుందని, ఉత్సాహాన్ని నటించక తప్పేదికాదు.

అక్కడనుంచి ఆవిడ చేతులు విలాసంగా తిప్పుతూ, కళ్లు ఎగరేస్తూ ఉత్సుకతతో చెప్పుకొచ్చేది కథ. తల్లి గరుడుడితో అన్నదట—నాయినా నేనేం ఆహారం ఇవ్వగలను. ఒక్కటి చెయ్యి. విషనిధి మధ్యన ఉన్నట్టువంటివిన్నీ, ప్రజలను ఎక్కువగా పీడిస్తూ ఉన్నట్టువంటివిన్నీ, నిషాదులనే వారిని భక్షించవలసిందీ అని అన్నట్టువంటిదైంకట. ఉద్రిక్త అయినప్పుడు ఆవిడకు ఇల్లాంటి భాష మాట్లాడటం సరదా.

ఈ మాటలు విని నేను సంతోషంగా తల ఊపితే మళ్లీ ఆవిడ ఇల్లా చెప్పింది. “ఆపళంగా ఆ గరుడాళ్వారు విషనిధి జొచ్చి బలసమన్వితులు అయినట్టువంటివిన్నీ దీర్ఘకాయులు అయినట్టువంటివిన్నీ నిషాదులను కొన్ని వేలమందిని భక్షించాడట! ఇల్లాంటివాళ్లు ఉండేవాళ్లండీ పూర్వకాలంలో! ఇప్పటి కాలంవాళ్లు ఒక్క వేయి మామిడిపండ్లు అయినా తినగలరా?

"మామిడిపండ్లదాకా ఎందుకూ? ఒక్క వెయ్యి రేగు పండ్లుకూడా తినలేరు." అని నేనన్నాను.

ఆవిడకు ఎక్కడలేని సంతోషం కలిగింది. తన కుటుంబంలో పూర్వీకులుకూడా చాలా బలం కలవారనీ యోగ్యులనీ, భక్తులనీ చెపుతూఉండేది.

మా ఆవిడ పుట్టిల్లు ఒక కుగ్రామం. ఆ ఊరికి కృష్ణ రెండుమైళ్ళ దూరంలో ఉంది. వాళ్లమ్మ, నాలుగు బిందెలు పట్టే పెద్ద కాగుతో కృష్ణనుంచి మంచినీళ్లు మోసుకొని వచ్చేదట ఈ రెండుమైళ్లూ ఇసుకలో నడిచి.

వాళ్ల నాన్న తెల్లవారుఝామున నాలుగు గంటలకు బెజవాడలో బయలుదేరి పదకొండింటికల్లా భోజనానికి బందరు వెళ్లేవాడట. ఎప్పుడైనా కోర్టుపనిమీద వెళ్ళాలసివస్తే!

వాళ్ల ఊరుచుట్టూరా ఉన్న భూములలో సగం భూములు వాళ్లవేనట! కాని వాళ్ల తాతా, తండ్రీ అవన్నీ అమ్మేశారట! ఇల్లాంటి విషయాలు ఆవిడ ఎన్నో చెబుతుండేది.

మా పూర్వీకులుకూడా చాలా గొప్పవాళ్లు అని నేనూ చెప్పటం అవసరమని తోచింది. ఏం? వాళ్ల పూర్వీకులు

గొప్పవాళ్లు అయితే మా పూర్వీకులు. చాలా గొప్పవాళ్లే ఎందుకుకారూ!

మాది మొదటినుంచి బస్తీ కాపురం. పల్లెటూళ్లల్లో కాపురం అంటే మావాళ్లకు మొదటినుంచి అసహ్యం. మాకు పొలాలు లేవు గాని, ఈ పూరులో ఉన్న మేడల్లో సగం మేడలు మా ముత్తాతగారు కట్టించినవే. మా తాతగారి కాలంలో అవన్నీ అమ్మేశాం. ఇల్లా ప్రారంభించాను.

ఆవిడ అడిగింది "కేశినిమహల్ కూడా మీ తాతగారు కట్టించిందేనా" అని. అవున్నాను నేను బెరుకులేకుండా. "అయితే మీ తాతగారు తాపీ మేస్త్రీ—అయినా అయి ఉండాలె, లేకపోతే కంట్రాక్టరు అయినా అయి ఉండాలె" అని ఆవిడగారు నవ్వింది.

నాకు కాస్త కోపం వచ్చింది కాని, ఇంకా కోపమూ, విసుకూ పైకిచూపే రోజులుకావు అవి. అందుకని నేనూ నవ్వి "అల్లాకాదు నిజం" అన్నాను. ఆవిడ అమాయకంగా నా వంక చూచింది. సరే, ఇంకేం నా మాటలు నమ్ముతున్న దనుకొని మళ్లీ కొన్ని సంగతులు చెప్పాను.

అది మా తాతగారి సంగతి. మా తాతగారు కడుపు నిండా భోజనంచేసి, నశ్యం బిగించి, వసారాలో గోడకు జేర్లా

బడి చుట్ట వెలిగించాడా అంటే, అది ఆరాత్రి రాత్రిలంతానూ, మర్నాడు మధ్యాహ్నం పన్నెండు గంటలదాకానూ కాలుతూ ఉండేది.

"అబ్బా అంత పెద్దచుట్ట కాల్చేవాడండి! అయితే ఆయన నిద్రపోవటం లేదన్నమాట?"

"ఇదేనా నీవు గ్రహించింది? నిద్రలోకూడా అల్లాగ అల్లాగ చుట్ట కాలుస్తూ ఉండే వాడన్నమాట గుప్ గుప్పున పొగ వదులుతూ."

"నిజమే! ఉంటారు! అందులో వైపరీత్యం ఏమీ లేదండీ" అన్నది ఇవిడ.

ఇంకొకటి చూశావా కాంతం నీవు చెప్పినట్లు పూర్వ కాలం సంగతే వేరు! మనుష్యుల సంగతేకాదు. ప్రకృతి కూడా మారిపోయింది. ఎప్పటిదాకానో ఎందుకు నా చిన్న తనంలో ఉన్నట్లు ఇప్పుడు లేదు కాలం. నా చిన్నతనంకూడా పూర్వకాలంలో లెక్కే. నాకు బాగా జ్ఞాపకం. ఆ రోజుల్లో చంద్ర గ్రహణం, సూర్య గ్రహణం, ఇల్లాంటివి చూశావా ఒక్కసారి పట్టినాయా అంటే, ఆ పట్టు పట్టు మూడు రోజులు నాలుగు రోజులు అల్లాగ ఉండిపోయేవి! ఇప్పుడేముంది, ఒక అరగంట! మహా ఉంటే గంట!

ఇల్లాగ నేనూ చెప్పేవాణ్ని మా పూర్వులనుగురించీ వాళ్ల ధైర్యసాహసాలనుగురించి. ఎంత చెప్పినా, ఆవిడ లోపల ఉద్దేశం ఏమిటంటే, వాళ్ల పూర్వీకులంత గొప్పవాళ్లు, మా వాళ్లు కారనే. గ్రహణాలు మూడు రోజులదాకా పట్టటం నే నెరుగుదునని చెప్పిన తరువాతనైనా నేనుకూడా, ఆ పూర్వ కాలపు గొప్పవాళ్లతో సమానమైన ప్రతిభ కలవాడిని అని ఆమె అనుకొందో లేదో, నాకు తెలియదు.

12

ఒక రోజున మా అబ్బాయిని పిలిచి గుర్రం మీద కాంపోజిషన్ వ్రాశావురా నాయనా అన్నాను. "గుర్రంమీద వ్రాయటం ఎందుకండీ" అన్నది కాంతం. "పిల్లలకు చదువు చెప్పే సమయంలో నీవు అడ్డురాకు. నీకెందుకూ, నీవు ఊరుకో" అని ఆవిడను కోప్పడ్డాను.

ఆమాత్రానికి ఊరుకునే మనిషి అయితే ఆవిడ ఇంకా అనుకోవలసిందేముంది? అఁహ ఊరుకోలేదు. ఊరుకోక "గుర్రంమీద వ్రాయటం ఏమిటో నాకు చెప్పకూడదా ఏమిటండీ? అయినా ఇల్లాంటి వెధవపనులు నేర్పకండీ, గుర్రాలమీద గాడిదలమీద వ్రాయటం. పిల్లలు చెడిపోగలరు" అంటూ కొంచం విసుక్కున్నది.

గుర్రంమీద వ్రాయటం అంటే గుర్రాన్ని గురించి వ్రాయటమే ఇప్పుడు తెలిసిందా? అని అడిగాను. ఈ జవాబుతో ఆమె తృప్తిపడుతుందనుకొన్నాను. కాంతం ఒక్కక్షణం తీక్షణంగా ఆలోచించి "అల్లాగ అయితే గుర్రాన్ని

గురించి మటుకు వ్రాయటం ఎందుకండీ" అన్నది ఒక పెద్ద సందేహం తనకు బాధిస్తున్నట్టుచూస్తూ.

నేను ఈ ప్రశ్నకు ఏమీ జబాబుచెప్పలేక ఊరుకొన్నాను. ఆమెగారు ఊరుకోక గుర్రాలను గురించీ, గాడిదలను గురించీకూడా. నేర్చుకోవాలే ఏమిటండి అబ్బాయీ? అన్నది దీర్ఘాలుతీస్తూ ఈసడింపుగా.

"గుర్రాలను గురించి గాడిదలను గురించి మనం నేర్చుకోవలసింది ఎంత ఉందో నీకేం తెలుసు! అదో పెద్దశాస్త్రం".

"నిజమేలెండి. గాడిదలనుగురించి నాకు ఏమీ తెలియదు. ఇన్నాళ్లఒట్టీ తెలియకుండానే జరిగింది. అబ్బాయికి తెలియటం అవసరమా?"

"ఆ చాలా అవసరం. ఎందుకు అవసరమో ఇట్లాంటి విషయాలు ఎందుకు నేర్చుకోవాలో నీకు తెలిసేటట్లు చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. నాకు ఇప్పుడు అంత ఓపిక లేదు. కాస్త నాలుగుముక్కలు వాడికి చెప్పనియ్యి" అన్నాను.

"అయ్యో, నేను వద్దు అని అన్నానా ఏదో ఊరికే అడిగానుగాని! గుర్రాలను గురించి, కుక్కలను గురించి

చెప్పండి" అన్నది ఆవిడ ముక్కూ మూతీ విరిచి, ఈ చదువు ఎందుకూ పనికొచ్చేది కాదన్నట్లు తలతిప్పుతూ.

ఇల్లాగ అన్నా నేనేమీ చిన్నబుచ్చుకోలేదు. ఈ మాత్రానికి నిరుత్సాహపడితే నేను అసలు బడిపంతులు పని చెయ్యనే లేను.

ఎందుచేతనంటారా, క్లాసులో మనం పాఠం చెబుతూ ఉంటే ఒక్కొక్కప్పుడు ఒక్కడూ వినడు. ఏమిటి వినేది వెధవమోత అన్నట్లు వేరే మాట్లాడుకుంటూ ఉంటారు. అయినా మనం నిరుత్సాహపడము. పాఠమూ ఆపివెయ్యము. ఇల్లాంటప్పుడు ఈవిడగారు కాస్త ముక్కిందని నేను ఊహించాలా ?

అబ్బాయిని పిలిచి నేను వ్రాసిన కాంపోజిషన్ చదవరా అన్నాను. వాడు పుస్తకం తెచ్చి నాముందు కూర్చున్నాడు.

"ఏం వ్రాశావో చదువు!"

"గుర్రమును గాడిదయు ఒకే జాతిలోని జంతువులు." ఈ వాక్యంవిని కాంతం, మళ్ళీ విరగబడినవ్వి, "ఇదేమిట్రా నాయనా, గుర్రం గాడిదా ఒకటేనట్రా ఇదేంచదువురా?" అంటూ వెకిలిగా విపరీతంగా నవ్వటం సాగించింది.

నాకుమట్టుకు మహా చెడ్డకోపం వచ్చింది. ఈ ఆడవాళ్లకు ఏమీ తెలియనూ తెలియదూ పైగా మనను వెక్కిరిస్తారు.

చివరకు "నీకు తెలియదు ఊరుకో, ఆ రెండూ ఒక జాతిలోనివే" అని నేను గట్టిగా కోప్పడ్డాను. కోపడ్డాగదా అని ఏమన్నా ఊరుకొందా!

"క్షమించండి. నేనేమన్నా చదువుకొన్నానా ఏమన్నానా గుఱ్ఱం గాడిదా ఒకటే అని తెలియటానికి! చదువుకొన్నవాళ్లకు తెలుస్తయ్యి గుఱ్ఱం గాడిదా ఒకటే అన్న సంగతి!" అని అంటూ మళ్లీ విరగబడి నవ్వింది.

ఈ ధోరణిచూస్తే నాకుకూడా కొంచెం సందేహం కలిగింది, నిజంగా గుఱ్ఱం గాడిదా ఒక జాతిలోనివేనా, లేక నేను పొరపడుతున్నానా అని. ఆ రెండూ ఒక్క జాతిలోనివే అని మళ్లీ నిశ్చయించుకొని ఆపైన చదవరా నాయినా అన్నాను అబ్బాయితో. వాడు తాను వ్రాసిన కాంపోజిషన్‌లో రెండో వాక్యం చదివాడు గుఱ్ఱానికి నాలుగు కాళ్లు ఉన్నవి అని.

"నిజంగానుటరా? నాలుగుకాళ్లే!! గుర్రానికి నాలుగు కాళ్లు ఉన్నాయని అబ్బాయికి ఎల్లా తెలిసిందండీ?" అంటూ ఆవిడ మళ్ళీ పగలబడి నవ్వింది.

"ఎందుకు అల్లాగ నవ్వుతావు? గుర్రానికి నాలుగు కాళ్లూ లేవా?" అన్నాను నేను కొంచం కోపంగా.

"ఏమండోయ్, మీకేమన్నా మతిపోయిందా ఏమిటి? గుర్రానికి నాలుగు కాళ్లండీ!" అని నేనేదో వెర్రివాడిని అయినట్లు నా వంకజూచి మళ్లీ నవ్వటం సాగించింది.

మా పెద్ద అమ్మాయీ, చిన్న అమ్మాయీకూడా అక్కడే ఉన్నారు. వాళ్లంతాకూడా తల్లితోపాటు నావంక జూచి విపరీతంగా నవ్వటం సాగించారు.

గుర్రానికి మూడు కాళ్లు ఉన్నయ్యారా, ఎందుకు అల్లాగ నవ్వుతారు" అని నేను అనుకుంటే వాళ్లు మరీ నవ్వారు.

అందుకని వాళ్లతో మాట్లాడటం మానేసి పై వాక్యం చదవరా నాయినా అన్నాను రాధాయితో.

"గుర్రానికి రెండు చెవులున్నవి. కాని కొమ్ములుండవు" అని మళ్లీ వాడు చదివాడు.

"అబ్బాయికి ఎన్నెన్ని విషయాలు నేర్పుతున్నారండి! ఎందుకు వెధవపురాణాలు!! గుర్రానికి నాలుగు కాళ్లు!! రెండు చెవులు!!" అంటూ ఆవిడ వెక్కిరిస్తూ ఉంటే నాకు కాస్త కష్టంగానే ఉంది.

అప్పటికి నాకు తెలిసింది వాళ్లు ఎందుకు నవ్వుతున్నదీని. అవేమీ గొప్ప సంగతులు కావని వాళ్లు వేళాకోళం చేస్తున్నారు.

అందుకని నేనన్నానూ ఇందులో విషయం కాదు నీవు చూడాలిసింది వాక్యరచన అని తెలియచెప్పాను. "ఓహో అల్లాగా" అని అప్పటికి ఊరుకొంది.

"నువ్వు చదవరా నాయినా మీ అమ్మకేం తెలుసు అల్లాగే నవ్వుతుంది" అన్నాను. మా రాఘాయ మళ్లీ చదివాడు. "గుర్రము వైద్యమునకు పనికివచ్చును" అని.

వైద్యానికి పనికిరావటం ఏమిటి? అని నేను అనుకుంటూ ఉండగానే, గుర్రాన్ని నూరి మందులో వేస్తారా ఏమిటో" అంటూ ఆవిడ మళ్ళీ విరగబడ్డది.

ఇల్లాగ నవ్వటం మా రాధాయకూడా ఒప్పుకోలేము ఈ పర్యాయం. "వినవే అమ్మా అశ్వముయొక్క గంధము నుండి అశ్వగంధాది లేహ్యము తయారుచేయుదురు." అని చదివి వినిపించాడు. ఈ తభా నేనుకూడా నవ్వకతప్పింది కాదూ.

ఇక ఆవిడ ఉప్పెనగా నవ్వింది. "అశ్వముయొక్క గంధం ఏమిట్రా నాయినా అదెట్లా వుంటుందరా" అననూ నవ్వనూ.

మా అబ్బాయి వాక్యరచన బాగానే ఉంది. పదింటికి ఆరు మార్కులు ఇవ్వవచ్చు. కాని మా ఆవిడ నవ్వటంవల్ల నా మనస్సు చెడిపోయింది. కుక్కమీదకూడా పాఠం చెప్ప దల్చుకొన్నవాడ్ని ఆ రోజుకు చెప్పడమే మానేశాను.

13

కాంతానికి తెల్లచీరలంటే ఎక్కువ ఇష్టం. ప్రొద్దుగూకులూ ఏ రంగుచీరో కట్టుకున్నా సాయంత్రానికిమాత్రం తెల్లచీర కట్టేది. మల్లెపూలన్నాకూడా ఆమెకు ఎంతో ఇష్టం.

ప్రతిరోజూ భోజనానంతరం ఆవిడ దేవకన్యలాగ నా గదిలోకి వచ్చేది. జరీ అంచు తెల్లని చీర కట్టుకొని, తెల్లని రవిక తొడుక్కొని జడలో అర్ధచంద్రాకారంగా పూలు పెట్టుకుని మంచినీళ్ల చెంబుతో ఆవిడ మెల్లగా వస్తుంటే, క్షీర సాగరంలోనుంచి లక్ష్మి లేచివస్తున్నట్లు ఉండేది.

ఒక్కొక్కరోజున నేనేదో తీవ్రమైన ఆలోచనలో ఉండి ఆవిడ రాకను గమనించనట్లు నటిస్తాను. నిశ్శబ్దంగా ఆవిడ నా వెనుకవైపునకు వెళ్లి తన మృదువైన హస్తాలతో నా కళ్లు మూసేది. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. అప్పటికింకా సంతానం కలుగలేదు. రాత్రివేళ ఎవ్వరొచ్చి నా కళ్లు మూయటానికి సాహసిస్తారు.

ప్రతిరోజూ జరిగే పనికూడాను. అయినా నేను ఆ కళ్ళు మూసింది ఎవరో కనుక్కొంటానికి నానా అవస్థాపడి, తనకన్నా,

కమలమ్మ, పద్మావతి అంటూ ఏవో వచ్చిన పేరన్నీ చదివి చివరకు "కాంతం" అనేవాణ్ణి. ఆవిడ కిలకిలా నవ్వుతూ, [illegible] తీసి వేసేది. ఈ చిన్న నాటకం రోజుకో సారి తప్పేదు.

ఒకొక్కరోజున ఆవిడ దీపం చటుక్కున తగ్గించి వేసి, నా చేతులో ఉన్న పుస్తకాన్ని లాక్కుని బల్లమీద పెట్టి, తన [illegible] ను తాకి, ఆ తరువాత [illegible] నికి [illegible]

దీపం తగ్గిస్తే, నేను అనేవాణ్ణి "చూడూ కాంతం, దీపం తగ్గించకు."

"ఏంమకూ!"

"ఎందుకంటే, ఎందుకంటే," అంటూ నేను తల గోక్కునేవాడిని. ఎందుకో చెప్పిన జ్ఞాపకం వచ్చేదికాదు. చాలా కష్టపడి జ్ఞాపకం తెచ్చుకొని చివరకు అనేవాడిని

"నిన్ను కాస్త వెలుతురులో చూడాలని

"ప్రొద్దస్తమానం చూడలేదండీ. ప్రొద్దున్న కాఫీ ఇయ్యటానికి వచ్చినప్పుడు చూస్తిరి. స్కూలుకు వెళ్లేముందు కిటికిలోనుంచి చూస్తిరి. రోడ్డుమీద నడుస్తూ, తిరిగి తిరిగి చూస్తిరి సాయంత్రం చూస్తిరి. ఇంకా ఏమిచూస్తారండీ" అని అంటూ ఆవిడ విరగబడి నవ్వేది.

నిజానికి నాకు ఆవిడను అన్నిసార్లు చూచిన జ్ఞాపకం ఏమాత్రం ఉండేదికాదు. నేను తెల్లపోయి ప్రొద్దున నిన్ను చూశానా అనేవాడిని. "ఏమి విచిత్రమండీ నన్నుగాక ఇంకెవ్వరిని చూస్తున్నారండీ ఈ ఇంట్లో" అనేది.

"అహ అదికాదు. ప్రొద్దున్న నీ జడ అంత అందంగా లేదు."

"అంటే ఇప్పుడు పూలుపెట్టుకొన్నాను."

"ఇంతకు పూర్వం, నీ కళ్లు అంత ఆకర్ణాంత విశాలములై తేజఃపుంజములుగా లేవు.

"అబ్బ! ఏమి కవిత్వం అండీ. కాస్త కాటుక పెట్టుకొంటే అల్లాగే కనిపిస్తయి." అంటూ సిగ్గుపడి తల వంచుకొనేది.

"అసలు ఇంతకుపూర్వము నీవు ఇంత అందంగా ఎప్పుడూ లేవు" అని నేను ఆవిడను దగ్గరకు తీసుకొనేవాడిని.

"మీదంతా కవిత్వమండీ! అయినా వేళాకోళమంటేండీ! ఈ వేళప్పుడు నేను ఇల్లాగే కనపడతా" అంటూ ఆవిడ నా బుగ్గపైన చిటిక వేసేది. వళ్లు ఝల్లుమని పులకలు తేలేది. రోజెల్ల గృహకార్యాలయందు నిమగ్నయై ఉండే ఈ సామాన్య గృహిణి ఆ సమయానికి మోహనమూర్తి ఎల్లాగు అయ్యేదో! ప్రొద్దుగూకులూ లేని సిగ్గు ఆ వేళకు ఏ జ్యోత్స్నా తరంగములపైనుండి జారి ఆమె పెదవులను, కపోలములను, బుగ్గలను ఆవరించేదో!!

కళకళలాడుతూ ఉండే ఆరామంలోకి నన్ను ఆహ్వానిస్తూ స్వాగతం ఇచ్చే వసంత కోకిలా కలకంఠ గాన మాధుర్యమూ,

ఎండకాలంలో రాత్రంతా నిద్రపట్టక పట్టక ఏ కునుకో పట్టినప్పుడు, మంద మంద హాస్యాలతో జోకొట్టే ప్రత్యూష పవనాల శీతల స్పర్శా,

వెన్నెల్లో తెల్లని పాన్పుమీద శరద్రాత్రి అంతా గడిపి తూర్పు రేకలు తెల్లవారే సమయాన లేవబోతున్నప్పుడు వద్దు వద్దని హత్తుకొనే మా కాంతమ్మ గాఢ సంశ్లేషా నా కెప్పుడూ జ్ఞాపకానికి వస్తూ ఉంటాయి, జీవితము నిస్సారము అని తోచినప్పుడల్లా.

14

భార్యా పిల్లలతో కూడిన సంసారంలో వుండే కష్ట సుఖాలను అనుభవించి, ఆనందించలేకపోతే ఇంక దేన్ని చూచి ఆనందించగలము?

హృదయం వుండి నిజంగా అనుభవించగలవాడికి పిల్లలుగల ఇల్లు స్వర్గలోకంలోని నందనవనం కంటే హాయినిస్తుంది.

సుకుమార సుందర దళాలలో వికసించిన గులాబి పువ్వుకు ఒకటి రెండు ముళ్ళు ఉన్నంత మాత్రంలో దాని సౌరభమూ, సౌందర్యమూ, మార్దవమూ ఆకర్షించడం మానాయా?

ఆవిధంగానే సంసారంలో కష్టాలు సుఖానుభూతికి దారి చూపించే దీపాల కాంతులే కాని మనోవేదనలు బాధపెట్టేవి కావు.

చూడగలవాడికి ప్రకృతిలో అందం అంతటా యింట్లో కనపడుతుంది.

కాంతం

పసికూనల చిట్టి చేతులను చెక్కిళ్ళకు తాకించుకో
ఆనందాన్ని యివ్వకపోతే మల్లికాప్రసూనశోభా సౌందర్య
ఆనందాన్ని ఇస్తుందా?

పసిబాని బుగ్గలు ముద్దాడి పరవశం చెందని వా
శిరీష కుసుమ సౌకుమార్యం ఏ మనుభవించగలడు?

మృణాల నాళాల కంటే మృదువులైన చేతులను మె
చుట్టూ వేసి పసిబిడ్డ వలక పోసే బోసినవ్వుల హారాలకం
హిమబిందు మౌక్తికా హారము హాయినిస్తుందా?

రెమ్మ రెమ్మనూ పూచిన తీనలా కేరింతలా
లతో నిండిన యిల్లు కలకలలాడుతూ కనపడడం లేదూ!

వసంతకాలంలో సీతాకోక చిలుకలు పువ్వు పు
దగ్గరకూ పోయి క్షేమ సమాచారాలడిగి పలకరించి వస్తా

లేమావి చిగుళ్ళతో సంతృప్తి పొంది ఏ గుబు
చాటునో ఏ కాంతముండి కోయిలలు పంచమస్వరం
హృదయ పూర్వకంగా ఎవరినో ఆహ్వానిస్తూ ఉంటాయి.

ఇవి లేకపోతే వసంతమే కాదు. వసంత కాల
శోభే లేదు. అల్లాగే కిలకిలలాడుతూ గంతులువేసే పిల్లలున

కిచకిచలాడుతూ చూర్లలో అల్లరిచేసే పిచ్చికలున్నా లేని యిల్లు ఇల్లే కాదు అంటుంది మా కాంతం.

తన పిల్లలను చూచి ఆనందిస్తుంది. ప్రపంచమంతా తనయింట్లోనే చూస్తుంది. నిత్య పరితృప్తిలో దేవతా మూర్తిలా వెలుగుతూవుంటుంది. తన బిడ్డలను గురించి ఎన్నో తియ్యని కలలు కంటుంది. అబ్బాయి డిప్యూటీ కలెక్టరు చేస్తాడనీ, అమ్మాయి జమీందారుగారి భార్య అవుతుందనీ ఆమె అనుకుంటూ ఉంటుంది.

ఒకసారి మా అబ్బాయి చిఱునవ్వుతో పరుగెత్తుకుని వచ్చి నా వొళ్లో కూర్చున్నాడు. వాణ్ని మనసారా హృదయానికి కదిమి పట్టుకుని పుత్రగాత్ర పరిష్వంగ సౌఖ్య మనుభవిస్తూ మాటి మాటికీ ముద్దుపెట్టుకుంటూ ఆనందాన్ని పట్టలేక 'కాంతం! వీడు ఎట్లా పుట్టాడే! ఇంత చక్కనివాడు. ఈ దొరబాబు' అని అడిగాను.

ఈ ప్రశ్నకు ఏం జవాబు చెప్తుంది ఏ ఇల్లాలైనా! మొదట మా ఆవిడ తెల్లపోయింది. కానీ వెంటనే తేప్పరిల్లి పిల్లవాణ్ని తన చేతుల్లోకితీసుకుని ఎగరవేసి ముద్దాడుతూ 'వీడా! వీడు మన పూర్వజన్మ సుకృతం వల్ల పుట్టాడండీ' అన్నది.

15

కాంతా ప్రణయకథలలో కాలచక్రం గిరగిరా తిరిగి పోయింది. పదిహేను సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. అనుభూత జీవితం అంతా సుఖస్వప్నం అయింది. కొంత స్మృతిపథంలోనుంచి జారిపోయిందికూడా !

కాని అప్పుడప్పుడు ఏదో మధురానుభవము చప్పున అగాధస్మృతిశిలాల్లోనుంచి పైకి తేలుతుంది. ఒకప్పుడు అది అవ్యక్తమై హృదయంలో ఎక్కడో, దూరాన ఒక చిన్న తరంగంవలె స్మృతికి తాకుతుంది. మఱొకప్పుడు మధురాతి మధురానుభూతి సువ్యక్తమై మనస్సునకుతోచి చక్కిలిగింతపెట్టి సుళ్లుతిరిగి ఆనందాన్ని ఇస్తుంది.

ఒకరోజున ఆమె జరీచీర కట్టుకొని, వెడల్పైన జరీ అంచుగల తెల్లరవిక తొడుక్కొని జుట్టులో అర్ధచంద్రాకృతిగా మల్లెపూలు పెట్టుకుని ఆకాశంనుంచి సన్నగా జాఱిన శీతాంశు కిరణంలా మెల్లగా వచ్చింది గదిలోకి. నాకు మా ప్రథమ పరిచయం జ్ఞాపకానికి వచ్చింది. "కాంతం!"—అని ఆమెను అట్లాగే తేరిపార చూశాను బహుకాల తపఃఫలముగా ఈశ్వర సాక్షాత్కారం కలిగిన భక్తుడు చూచినట్లుగా.

"ఎందుకండీ అల్లా చూస్తారూ?" అన్నది.

"నీవు మొదటిరోజున సరీగా ఇలాగే కనపడ్డ కాంతం!"

"మొదటిరోజున అంటే?" అని అడిగింది.

"నువ్వు నా మీదికి వంగావు జ్ఞాపకంవుందీ! ఆరోజ అన్నాను. కాంతం సిగ్గు ముసుగులో కుంభించుకుపో ముఖంమాత్రం కొద్దిగా పైకెత్తి చిరునవ్వులో కనికరించి నేను ఊరుకోక మళ్లీ అడిగాను "ఎందుకు కాంతం! ఆ రో అల్లా వంగావు" అని.

కాంతం 'సాదు బరిణకోసం' అని అన్నది.

"సాదుబరిణకోసం మొగుడిపైకి వంగుతా అంతానూ?"

"పోనిలెద్దురూ! మీరు చేసిన పనిమాత్రం బాగు కామాలు. అప్పుడు నేను కాపరానికి రాని పిల్లనేక మీరు మా తమ్ముణ్ని ఎందుకు అడిగారూ మీ చిన్నక్కు ఎక్కడుందిరా అని. వాడి చిన్నక్కయ్యతో మీ కేం చెప్పండి నిజానికి?"

"అంపుల్లో తప్పు ఏమాత్రమూ లేదు. ఊరికేనే అడిగాను."

కాంతం కళ్లూ మూతీ తిప్పుతూ హేళనగా అన్నది "పాపం! ఊరికేనే అడిగారేం? పట్టి నంగనాచి. నోట్లో వేలు పెడితే కూడా కొరకలేదు" అన్నది విరగబడి నవ్వుతూ.

"అట్లా అంటావనేగా నీ వేలొకసారి కొరికాను?"

"ఒక్కసారి వేలు కొరికావు. దాని తర్వాత......"

"అదేమిటే! దాని తరువాత మళ్లీ నీ వేలెప్పుడూ కొరకలేదే!"

"ఆ! వేలు కొరక్కపోతేనేం! వొళ్ళంతా కొరికావు!" అంటు నవ్వింది.

ఇద్దరం కొంతసేపు నవ్వుకొన్నాము. తరవాత కొంచెం సేపటికి "మీ కసలు చాలా కొంటెతనం సుమండీ!" అన్నది.

"ఏం?"

"ఆరోజున మధ్యాహ్నం పెరట్లోంచి వస్తున్నప్పుడు ఎవ్వరూ చూడకుండా చిటికెన వేలు పట్టుకొని లాగారు. ఎందుకు చెప్పండి" అన్నది సిగ్గుతో తల వంచుకొని.

"నేనా లాగింది, నువ్వుకదూ? ఎందుకబద్ధమాడతావు? ఆడపిల్లలు పుడతాయి."

"మొగపిల్లలుగూడా పుట్టుకొచ్చారు కాబట్టి నాది అబద్ధంకాదని తెలుస్తూనేవుంది."

"సరే! నేను చిటికెనవేలు లాగితే నువ్వు ఎందుకు వూరుకున్నావు? అది చెప్పు పోనీ!"

"ఊరుకోక ఏంచెయ్యాలేమిటి?"

"మీ అమ్మతో చెప్పాలిసింది. లేకపోతే పెద్దగా కేక వేసి అందరితో చెప్పి నన్ను పదిమందిచేతా చీవాట్లు వేయించాలిసింది."

కాంతం నవ్వింది. "అంతపని చెయ్యలేను. కాని అక్కయ్యతో చెప్పాను."

"ఏమిటీ? ఈ సంగతి నాతో నువ్వెప్పుడూ చెప్పనే లేదే! అక్కయ్యతో చెప్పావు? చెపితే మా వదినెగారు ఏమన్నదీ తద్విషయంలో!"

"మీదే తప్పు అన్నది."

"నాదే తప్పు—ఆ సంగతి అప్పుడే చెప్పినట్లయితే క్షమించమని ఆమె పాదపద్మములకు ప్రణమిల్లేవాణ్ణే!"

"క్షమించమని అడిగినా అసలు క్షమించేదికాదు.

"ఏంచేతా! అంత క్షమించరాని తప్పు అన్నమాట అది."

"అక్కయ్య అట్లాగే అన్నది."

"ఆహా అక్కయ్య అంటే అప్పీలులేదు. మరి ఆ తప్పు దానికి సన్ను శిక్షించమనలేదూ?"

"మిమ్మల్ని కొట్టమన్నది అట్లాంటిపని ఎప్పుడూ చెయ్యకుండా."

"కొట్టకపోయినావా? బుగ్గలు సాగదీయకపోయినావా? చెవులు మెలివేయకపోయినావా?"

"ఆ! ఎందుకని క్షమించాను."

"అదిగో అంగూడా ఎందుకు? ఆరోజునే జడకుచ్చులతో కొట్టావు. ఒకరోజున బుగ్గలు సాగదీశావుకూడా? అసలు నీవు పెండ్లిరోజునే గంధం పూస్తూ చెంపమీద చటుక్కు మనిపించావు ఇట్లాగ" అని ఆమె బుగ్గలు తాకాను.

ఆమె సిగ్గుపడి "మీరుమటుకు ఏమి? ఎరగనట్లు నాకు మెడలో గంధం పూస్తూ మాతికి పూయలేదుటండీ" అన్నది.

"చిన్నతనం. అప్పుడు బొత్తిగా చిన్నతనం" అన్నాను.

"అప్పుడు చిన్నతనం అయితే ఇప్పటికి చిన్నతనం పోలేదు మీకు!"

"ఏంజేశానే కాంతం. అల్లా అన్యాయంగా అంటావ్?"

"మొన్న నేగదండీ! వంటయింట్లోకి పోతూ పోతూ నన్ను తోసుకుని పోతిరి!!"

"దారిలో ఉండి కదలకపోతే తప్పనిసరిగా తాకాల్సి వచ్చింది మడికట్టుకున్నదాన్ని! ఏంజేసేది!"

"పాపం! ఎన్నిసార్లు ఇల్లాగ తప్పనిసరి అయిందో!" అంటూ పకపక నవ్వింది కాంతం.

ఇక నవ్వలేక పక్కమీద పడుకుంది.

మా కాంతం ఆరోజున మళ్లీ స్వర్గలోకాలనుంచి దిగి వచ్చిన దేవతలా కనిపించింది. సొట్టలుపడే ఆ చెక్కిళ్ళు, చిక్కినా, నీటి బుడగల్లాగ మనోహరంగా వున్నాయి. తలలో ఒకటి రెండు తెల్ల వెంట్రుకలు మెరుస్తున్నా ఆమె కేశముల సౌందర్యం తగ్గలేదు. మెలికలు చుట్టుకున్న నల్ల త్రాచులాగ ఉంది ఆమె కేశబంధము. ఆమె పడుకున్న శయ్య పదిహేను ఏండ్ల సౌఖ్యజీవితాన్ని జ్ఞాపకం చేసింది.

ఆమె కబరీచ్యుతమల్లికా కుసుమాలు ఇంతకంటే నీ జీవితానికి సౌఖ్యం ఎప్పుడు? అన్నట్టుగా వికవిక నవ్వినై.

ఏదో సుఖస్వప్నం కంటున్న దానివలె అరవిచ్చిన తమ్మిమొగ్గలవలె కళ్లు పెట్టుకుని మత్తుగా నావంక చూస్తుంటే ఆ కళ్లల్లో పదహేనుపండ్ల దివ్య దాంపత్యం లీలగా తోచింది—తొంగిచూచింది—కళకళలాడింది—సాక్షాత్కరించింది.

ఒళ్లు ఉప్పొంగింది. జలజలలాడింది. వానచినుకు పడగానే మొలకెత్తిన వరినారు మడిలా శరీరమంతా పులకించింది. నా తనువు పాలసముద్రం మధ్యనుంచి అమృతంతో పాటు లేచినట్లు తోచింది. ఆనందోద్రేకంతో అతిశయంగా ప్రసరించిన చూపులతో ఆమె కనుపాపల్లో నా నీడ చూచుకుంటూ చేతులు చాచి కాంతాన్ని దగ్గరకు తీసుకుని ముఖంలో ముఖం పెట్టి 'అవునుగాని కాంతం! నీవు నాకెక్కడ దొరికావు?' అని అడిగాను

ధ్యానంనుండి బైటికి వచ్చిన నిత్యానందం అనుభవించే యోగిలా నా వంక చూస్తూ 'ఎక్కడా దొరకలేదు. మీరు నాకూ దొరకలేదు. నేను మీకూ దొరకలేదు. మనం ఎప్పుడూ ఇంతే!' అని అని ఆవిడ నన్ను కౌగిలిలోనికి తీసుకుని తనలో ఐక్యం చేసుకొంటున్నట్టు హృదయానికి హత్తుకున్నది.

మేమిద్దరం ఇంతేనట! అంటే ఈ దాంపత్యం జన్మ జన్మాలనుంచీ ఇలాగే వస్తున్నది అని కాబోలు ఆమె ఉద్దేశం. వాల్మీకి ఇంతకంటే ఎక్కువ సత్యాన్ని చెప్పాడా సీతారాముల దాంపత్య కథనంలో!

16

మా కాంతతో సాంగత్యం నా శుష్క జీవితానికి అమృతభాండమైంది. ఆమె పవిత్ర నామము, ప్రేమపూరితము, మధురము, శక్తివంతము. జీవితంలోని మాధుర్యమూ, అందమూ, సౌఖ్యమూ అన్నీ ఆ పేర్లోనే ఇమిడి ఉన్నాయి నా దృష్టిలో.

ఇప్పుడు ఆమె పేరులో గతజీవితాన్ని అవలోకిస్తే మధురస్మృతి కలుగుతూ ఉంటుంది.

మొదటి రోజుల్లో ఆమె తనువ్యాప్తీ, కటిప్రాంతాలూ, సుదీర్ఘ నీలశిరోజాలూ, నవ్వు వెన్నెలలూ, మెరుపు చూపులూ, తీర్చిదిద్దిన ముఖవికాసమూ ఇవి నన్ను ఆకర్షించి ఆనందాన్ని ఇచ్చాయి. తరువాత ఆమె పిల్లలతల్లి అయింది. యౌవనపు పొంగు పోయింది.

ఆమె శరీర విన్యాసంలో వంపులమీదా, రేఖలమీదా, నునుపుమీదా, పసిమిమీదా ఉన్న తీవ్రమైన మోహము సన్నగిల్లింది. అప్పుడు ఆవిడ స్వభావం, ప్రవర్తన, ప్రేమా,

చమత్కార సంభాషణ ఇవి ఆనందాన్ని ఇచ్చి మాం దాంపత్యంలో ఉండే విలువను పెంచ్చించినై.

సూర్యుని మధ్యాహ్న తేజస్సు దివ్యమైనదే! ఆ తేజస్సు పోతుంది. కాని దిగులుపడాలిసిన అవసరం ఏమీ లేదు. చల్లని సాయంకాలంలో దేవలోకంలోని వీనులవలె కనపడే ఆకాశంలో ఉండే ప్రశాంత రామణీయకత ఆనందాన్ని ఇస్తుంది.

శ్రావణమాసంలో మహానది ఒడ్డుల నొరసికొని ఉద్రేకంతో ఆవేగంతో ప్రవహిస్తుంది. ఆ నడకలో అందం ఉంది. అదే నది కార్తీకమాసంలో తన గర్భంలో దాచి ఉంచుకొనిన శిలా శిశువులను చూస్తుతూ వాటి చుట్టూ ప్రేమతో ప్రశాంతంగా తిరుగుతూ ముద్దుపెట్టుకుంటూ పరిపూర్ణ సౌఖ్యం అనుభవిస్తూ ప్రవహిస్తుంది. ఆ నడకలోనూ అందం ఉంది. కాంతం జీవితంలోకూడా అల్లాగే యౌవనం పోయిన తర్వాత ప్రశాంతతా గాంభీర్యమూ అలుముకున్నాయి. అవయవములు తట్టుకోలేని శక్తివంతమైన యౌవనంలోనూ అందం ఉంది. ఆ పొంగు పోయినతర్వాత జీవితానికి వచ్చే తృప్తి, గాంభీర్యము, శాంతము వీటిలోనూ అందం ఉంది.

సాయంకాలపు రంగు రంగుల మేఘాలలో ఉండే అందం, గమనం; గంభీరమైన రాత్రిలో ఉండే మనోజ్ఞతా అన్నీ ఉత్తర జీవితంలో ప్రకాశించినై. అవే జీవితానికి సంతోషాన్ని ఇచ్చినై.

ఆ ఉత్తర జీవితంలో ఒక క్రొత్త రకం అందం ఆమెలో నాకు కనిపించింది. ఆ సౌందర్యం ఆమె జుట్టులో నవ్వుల్లో మెఱుపుల్లో నాకు కనిపించలేదు. వీటి కన్నిటికీ అందనిది, వీటికి అతీతమైనది, ఆత్మకు మటుకు ద్యోతకమయ్యేది, ఎన్నో పూర్వ జన్మలకు సంబంధించినది అయిన సౌందర్యం ఆమెలో ప్రకాశించింది.

ఆమె శాంతంగా బ్రతుకు వెళ్ళబుచ్చుకొన్నది. తన జీవితంలో తాను పొందవలెనని ఎంచుకొన్న ఆదర్శాలకు అన్నిటికీ భ్రమలమూలంగా తృప్తి కల్పించుకొన్నది. భర్త సుందరమూర్తి అని భ్రమ కల్పించుకొన్నది. అల్లాంటి శక్తి ఉంటే మనిషికి ఇంకేం కావాలి. నేను హాయిగా ఉన్నాను. నాకు ప్రపంచం అంతా ఆనందమయంగా ఉంది అని అనుకొనే గలిగిన మనఃప్రవృత్తే ఉంటే ఇక ఏమీ అక్కరలేదు. ఋషులు అనుభవించిన ఆనందం అల్లాంటిదే! తనభర్త సుందరమూర్తి అనుకొన్నది. ఆ భ్రమతోనే ఆనందంగా తృప్తితో క్రు

భూమిమీద ఉన్న నాలుగు రోజులూ కాలం గడిపింది. లేని పోనిది, ఎక్కడా దొరకని అసత్యమైన సౌందర్యం కోసం అన్వేషించి, దాన్ని పొందలేక పడవలేదు.

సహజంగా స్త్రీ హృదయంలో ఉండే సౌందర్యాన్వేషణకూ ఆత్మకు వికాసాన్నీ తృప్తినీ ఆనందాన్నీ ఇచ్చే అనుభూతి కొఱకై హృదయంపడే ఆరాటానికీ ఆమెకు శ్రీకృష్ణ భగవానుడే స్థానమైనాడు. పూర్వజన్మ సంస్కారంవల్ల లభించిన ఆ భక్తి శరద్రాత్రి వెన్నెలపైనుండి జారు హిమబిందువు మల్లె పువ్వును వికసింపజేసినట్లు ఆమె హృదయాన్ని వికసింప జేసింది. ఆమె సర్వస్వము రాధికావల్లభుడికి అంకితం చేసింది. కాబట్టి ఆమె జీవితంలో అసంతృప్తి యెరగదు.

ఆవిడ జీవితం అంతా త్యాగమే. భర్తకూ, పిల్లలకూ సచెయ్యడంలో ఆవిడ తన సౌందర్యమూ, యౌవనమూ, రాఖ్యమూ అన్నీ త్యాగంచేసింది. మందమారుత స్పర్శచే కసించి యువతీ కమ్మిల్లవిభూషమై చిట్టచివరకు భార్యాభర్తల న్యోన్య గాఢాలింగన సంరంభములలో నలిగిపోయి తన తాన్ని అర్పించిన మల్లికాప్రసూన జీవితం మా కాంతం తంకూడా. మల్లెపూవును నిర్దయతో కోసి, బుట్టలో సిమి, సూదితో గుచ్చి ఎంత బాధపెట్టినా సాయంత్రానికి

కళ్లా బాధలన్నీ మరిచిపోయి హృదయాన్నంతా విచ్చి విక సింపజేసి పరిమళాన్ని వెదజల్లుతుంది. కాంతమూ అంతే. పగలంతా పిల్లలకూ, భర్తకూ కావలసిన సేవజేసి కష్టాలు మరిచి సాయంత్రానికల్లా వికసించిన మల్లెపువ్వు అయ్యేది.

ఆవిడ నా జీవితానికి దివ్యజ్యోతి. జీవితంలోని కష్టాను భూతి తీక్ష్ణాతపాలకు ఆర్ద్రితను పోగొట్టుకొని శతధావిభిన్నమైన నా హృదయక్షేత్రానికి ఆమె అమృతవాహిని. చీకటిలో దేవులాడుతున్న నా బ్రతుకుకు ఆమె ధృవతార. నాకు తల్లి, సహోదరి, భార్య—అన్నీ ఆమెగానే ఉండేది.

పసిపిల్లవాడికి తల్లే లోకం. ఎంతసేపూ వాడు తల్లి చుట్టూ తిరిగి దాగుడుమూతలాడి నవ్వి ఆనందిస్తాడు. నా జీవితం అల్లాగే అయిపోయింది. నా బ్రతుకు బ్రతుకంతా కూడా ఆవిడచుట్టూ తిరిగి ఆమెకునే దాగుడుమూతలాట అయింది.

సాయంత్రం ఆకాశం ఎర్రమబ్బులతో మనోహరంగా ఉండి స్వర్గసీమల ద్వారాలు తెరుచుకొని గులాబీపూల వీథులు కనపడ్డప్పుడు, దేవతల కళ్ల మెఱుఁగులు మిణుగురు పురుగుల తళతళలుగా కనపడ్డప్పుడు మా కాంతం జ్ఞాపకానికి వస్తుంది.

ఎంత బుద్ధిహీనుడో ఆ భగవంతుడు! తాను నిర్మించిన సుందరభవనంలో ఉండే అతి సుందరమైన వస్తువును కూలాా్ౡడు.